**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 111, పేజీలు - 08

గురువారం,అక్టోబర్ 22, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




# బియ్యం కొనేదెట్టా..? కూడు తినేదెట్టా..?

## బిత్తరిపోయేలా చేస్తున్న బియ్యం రేట్లు!

- తెలంగాణలో ఆకాశాన్నంటుతున్న సోనా మసూరి ధరలు
- ఏడాదిలో 65.4 శాతం పెరుగుదల.. సామాన్యుల బడ్జెట్‌కు బియ్యం భారం
- ద్రవ్యోల్బణం 4 శాతం నుంచి 13 శాతానికి.. ధరల నియంత్రణపై సర్వత్రా ఆందోళన



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** దేశంలోనే అత్యధికంగా ధాన్యం పండించే రాష్ట్రాల్లో తెలంగాణ ముందువరుసలో ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రజలకు మాత్రం బియ్యం ధరల భారం తప్పడం లేదు. విస్తారంగా వరి సాగు జరుగుతున్న రాష్ట్రంలోనే నిత్యం వినియోగించే బియ్యం ధరలు ఆకాశాన్నంటడం సామాన్యులను ఆందోళనకు గురిచేస్తోంది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ఎక్కువగా వినియోగించే సోనా మసూరి బియ్యం ధరలు గత ఏడాది కాలంలో ఏకంగా 65.4 శాతం పెరగడంతో పేద, మధ్యతరగతి కుటుంబాల నెలవారీ బడ్జెట్ తలకిందులవుతోంది. నిత్యావసర ఆహార ధాన్యమైన బియ్యం ధరలు ఇలా భారీగా పెరగడం గృహిణులకు అదనపు భారంగా మారింది.

### ఆకాశాన్నంటిన హోల్‌సేల్ ధరలు

కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. తెలంగాణలో సోనా మసూరి బియ్యం హోల్‌సేల్ ధరలు ఏడాది వ్యవధిలో భారీగా పెరిగాయి. 2025 అక్టోబర్‌లో క్వింటాల్ బియ్యం ధర రూ.2,068గా ఉండగా, తాజా అంచనాల ప్రకారం అది రూ.3,419కు చేరుకుంది. అంటే క్వింటాల్‌పై రూ.1,351 పెరుగుదల నమోదైంది. శాతం పరంగా చూస్తే ధర ఏకంగా 65.4 శాతం ఎగబాకింది. మరోవైపు రాష్ట్రంలో బియ్యం ద్రవ్యోల్బణం కూడా ఆందోళనకరంగా పెరుగుతోంది.

ఈ ఏడాది ఏప్రిల్‌లో 4 శాతంగా ఉన్న ద్రవ్యోల్బణం సెప్టెంబర్ నాటికి 13 శాతానికి చేరింది. దీంతో నిత్యావసరాల కొనుగోలుకు కుటుంబాలు మరింత ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### మధ్యతరగతి కుటుంబాలపై పెనుభారం

గత ఏడాది మధ్యలో కొంత స్థిరంగా ఉన్న బియ్యం ధరలు క్రమంగా పెరుగుతూ వచ్చాయి. మధ్యలో స్వల్పంగా తగ్గినప్పటికీ, ఆ తర్వాత మళ్లీ భారీగా ఎగబాకాయి. దీంతో నెలవారీ ఆదాయంలో ఎక్కువ భాగం ఆహార ఖర్చులకే వెచ్చించాల్సి వస్తోందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగురు సభ్యులున్న కుటుంబానికి నెలకు కనీసం 25 కిలోల బియ్యం అవసరమవుతుందని, ధరలు పెరగడంతో కుటుంబ పోషణ భారంగా మారుతోందని హైదరాబాద్‌కు చెందిన గృహిణులు వాపోతున్నారు. బియ్యం ధరల పెరుగుదలతో ఇతర నిత్యావసరాల కొనుగోళ్లపై కూడా ప్రభావం పడుతోందని చెబుతున్నారు.

### కృత్రిమ కొరత సృష్టిస్తున్నారా?

దక్షిణ భారతదేశంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో బియ్యం వినియోగం అధికంగా ఉంటుంది. ఈ డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే ధరల పెరుగుదలకు ఇదే ప్రధాన కారణమని నిర్ధారించడానికి సమగ్ర మార్కెట్ పరిశీలన అవసరం. ఉత్పత్తి ఎక్కువగా ఉన్నప్పటికీ వినియోగదారులకు తక్కువ ధరకు బియ్యం అందకపోవడం మార్కెట్ వ్యవస్థలోని లోపాలపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.

### ధరల పెరుగుదలకు కారణాలేమిటి?

ఇతర వరి ఉత్పత్తి రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో బియ్యం ధరలు ఈ స్థాయిలో ఎందుకు పెరుగుతున్నాయనే అంశంపై వ్యవసాయ ఆర్థిక నిపుణులు దృష్టి సారిస్తున్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రూపొందించిన పాలసీ పత్రం ప్రకారం.. మార్కెట్‌లో దోపిడీ వ్యాపార పద్ధతులు, సరైన మార్కెట్ మౌలిక వసతులు లేకపోవడం ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలుగా పేర్కొన్నట్లు సమాచారం. మరోవైపు ఒడిశా వంటి రాష్ట్రాల్లో పంట దిగుబడి మెరుగ్గా ఉండటంతో అక్కడ ధరల పెరుగుదల ఈ స్థాయిలో లేదని నిపుణులు గుర్తుచేస్తున్నారు. వర్షపాతంలో మార్పులు, వాతావరణ పరిస్థితులు కూడా మార్కెట్ అంచనాలు, ధరలపై ప్రభావం చూపుతున్నాయని

2లో..

## అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో భారత పర్యటన

- వ్యాపారం, ఇంధనం, దౌత్యపరమైన 5 కీలక అంశాలు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో అక్టోబర్ 20న భారత్‌లో పర్యటించారు. సాధారణంగా దౌత్య పర్యటనలు న్యూఢిల్లీ కేంద్రంగా సాగుతుంటాయి. కానీ ఈసారి రూబియో నేరుగా ముంబైకి చేరుకోవడమే కాకుండా జామ్‌నగర్‌లోని రిలయన్స్ రిఫైనరీని కూడా సందర్శించారు. ఈ పర్యటన ప్రధానంగా 'వ్యాపారం', 'ఇంధనం' 'భద్రత' అంశాల చుట్టూనే సాగింది. వాణిజ్య ఒప్పందాలు, వ్యూహాత్మక భాగస్వామ్యంపై సానుకూల సంకేతాలు కనిపించినప్పటికీ, పాకిస్థాన్ పట్ల అమెరికా వైఖరి, రష్యా చమురు కొనుగోళ్లపై వ్యాఖ్యలు భారత్‌కు మిక్స్‌డ్ విధానాన్ని అందించాయి. మార్కో రూబియో పర్యటనలోని 5 కీలక ముఖ్యాంశాలు తెలుసుకుందాం.

2లో..

## ఎమ్మెల్సీ పోరు.. మిత్రపక్షాల అలక!

- బుజ్జగింపుల బాటలో పీసీసీ చీఫ్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్న కాంగ్రెస్ పార్టీ మిత్రపక్షాల మద్దతు కూడగట్టే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. అభ్యర్థుల ప్రకటన సమయంలో తమను సంప్రదించలేదంటూ అసంతృప్తిగా ఉన్న పార్టీలను బుజ్జగించే పనిలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నిమగ్నమయ్యారు. భవిష్యత్తులో ఎన్నికల సమయంలో ముందస్తు చర్చలు జరుపుతామని, మిత్రపక్షాల డిమాండ్లపై కూడా సానుకూలంగా చర్చిస్తామని చెబుతూ మద్దతు కోరుతున్నట్లు సమాచారం.

2లో..

## ఖజానాకు కిక్కు

- ఒక్క దసరా నాడే రూ.303 కోట్లు విక్రయాలు
- గత ఏడాదితో పోలిస్తే 37.02 శాతం వృద్ధి
- బీర్ల అమ్మకాల్లో 41 శాతానికి పైగా పెరుగుదల
- 30.37 లక్షల కేసులకు చేరిన బీర్ల విక్రయాలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో దసరా పండుగ సీజన్ మద్యం వ్యాపారానికి భారీ ఊతమిచ్చింది. అక్టోబర్ మొదటి 19 రోజుల్లోనే రాష్ట్రవ్యాప్తంగా రూ.2,054.51 కోట్ల విలువైన మద్యం విక్రయాలు నమోదు అయ్యాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే అమ్మకాల విలువ 37.02 శాతం పెరిగినట్లు ఎక్సైజ్ శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ముఖ్యంగా బీర్ల విక్రయాల్లో గణనీయమైన పెరుగుదల కనిపించగా.. అక్టోబర్ 19వ తేదీన ఒక్కరోజే రూ.303.40 కోట్ల విలువైన మద్యం అమ్ముడవడం గమనార్హం.తెలంగాణ ఎక్సైజ్ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం 2026 అక్టోబర్ 1వ తేదీ నుంచి 19వ తేదీ వరకు తెలంగాణలో మద్యం అమ్మకాల విలువ రూ.2,054.51 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే సమయంలో నమోదైన విక్రయాలతో పోలిస్తే ఈసారి 37.02 శాతం వృద్ధి నమోదైంది. పండుగల

2లో..

## 2028లోగా పోలీస్ శాఖలో ఖాళీలన్నింటిని భర్తీ చేస్తాం

- పోలీస్ శాఖకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నాం

- పోలీస్ అమరవీరులకు నివాళులర్పించిన సీఎం
- మహిళల భద్రతకు ప్రాధాన్యం
- డ్రగ్స్ నియంత్రణలో ఈగల్ సేవలు భేష్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** విడతలవారిగా నియామకాలు చేపడుతూ 2028 నాటికి పోలీసు శాఖలో అన్ని ఖాళీలను భర్తీ చేసి సిబ్బంది కొరత అన్నది లేకుండా చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. పోలీసు అమరుల త్యాగాలను గౌరవిస్తూ, వారి ఆశయాలను కొనసాగిస్తూ శాంతియుతమైన, సురక్షితమైన, అభివృద్ధి చెందిన తెలంగాణను నిర్మించుకుందామని పిలుపునిచ్చారు. హైదరాబాద్ గోషామహల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా అమరవీరుల స్థూపం వద్ద పోలీసు అమరవీరులకు నివాళులు అర్పించారు.అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగించారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, ఆహారం

2లో..

## చెప్పాం.. చేస్తున్నాం' నినాదంతో ప్రజల్లోకి

- స్థానిక ఎన్నికలపై టీడీపీ ముఖ్య నేతలతో సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్
- రెబల్స్‌గా నామినేషన్లు వేస్తే సస్పెన్షన్ తప్పదని కఠిన హెచ్చరిక
- కూటమి పార్టీలతో సమన్వయంతో పనిచేసి మిత్రధర్మాన్ని పాటించాలని సూచన
- టికెట్ రాని నేతలకు నామినేటెడ్ పదవులు ఇస్తామని హామీ



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల వేళ అధికార కూటమిలో రెబల్ అభ్యర్థుల వ్యవహారం రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పార్టీ నిర్ణయాన్ని కాదని స్వతంత్రంగా బరిలో నిలిచే అభ్యర్థులు వెంటనే నామినేషన్లు ఉపసంహరించుకోవాలని తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. మాట వినకుండా పోటీలో కొనసాగితే పార్టీ పరంగా క్రమశిక్షణ చర్యలు తప్పవని అవసరమైతే సస్పెన్షన్ వేటు వేస్తామని హెచ్చరించారు. కూటమి అభ్యర్థుల విజయానికి అడ్డంకులు లేకుండా చూడాలని పార్టీ ముఖ్య నేతలకు దిశానిర్దేశం చేశారు. స్థానిక ఎన్నికల ప్రచారం, అభ్యర్థుల ఎంపిక, కూటమి పార్టీల మధ్య సమన్వయం వంటి అంశాలపై పార్టీ ముఖ్య నేతలతో సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పార్టీ అధికారిక అభ్యర్థులకు వ్యతిరేకంగా నామినేషన్లు వేసిన వారితో మాట్లాడి పోటీ నుంచి తప్పుకునేలా చూడాలని సూచించారు. రెబల్ అభ్యర్థుల కారణంగా ఓట్లు చీలిపోకుండా కూటమి అభ్యర్థుల విజయావకాశాలకు ఇబ్బంది కలగకుండా నాయకులు చొరవ తీసుకోవాలని ఆదేశించారు.

టీడీపీతో పాటు కూటమిలోని జనసేన, బీజేపీ అధికారిక అభ్యర్థులు పోటీ చేస్తున్న స్థానాల్లోనూ పరస్పర అవగాహనతో వ్యవహరించాలని చంద్రబాబు స్పష్టం చేశారు. మిత్రపక్షాల మధ్య సీట్ల

3లో..

## మళ్లీ భగ్గుమన్న క్రూడ్ ఆయిల్

- బ్యారెల్ 110 డాలర్లకు చేరిక

2లో..




## సౌరవ్ దాస్, అశుతోష్ రంకాలకు ఊరట

- ఏడు రోజుల తర్వాత సీజేపీ నేతలు విడుదల



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నాయకులు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాలకు భారీ ఊరట లభించింది. ఇరువుర్నీ పూచీకత్తుపై విడుదలకు స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కోర్టు ఆమోదించినట్టు అధికారులు తెలిపారు. ఏ కేసులోనూ కస్టడీలో లేకపోతే వారిని జైలు నుంచి విడుదల చేయవచ్చని కోర్టు పేర్కొంది. వారి జుడీషియల్ కస్టడీని మరో మూడు రోజులు పొడిగించాలని ఢిల్లీ పోలీసులు చేసిన అభ్యర్థనను కోర్టు తోసిపుచ్చింది. దీంతో గత ఏడు రోజులుగా పోలీసు కస్టడీలో ఉన్న ఈ ఇద్దరు నేతలు జైలు నుంచి విడుదల కానున్నారు. కోర్టు ఉత్తర్వులపై సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్

2లో..

## డ్రోన్ల ఆట కట్టించేందుకు ఆర్మీకి కొత్త రాడార్లు

- రూ.770 కోట్లతో ఒప్పందం



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) సరిహద్దుల్లో డ్రోన్ల ముప్పును సమర్థంగా ఎదుర్కొనేందుకు భారత సైన్యానికి కొత్త రాడార్లు అందుబాటులోకి రానున్నాయి. ఇందుకోసం రక్షణ మంత్రిత్వ శాఖ ప్రభుత్వ రంగ సంస్థ భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్)తో రూ.770 కోట్ల విలువైన ఒప్పందం కుదుర్చుకుంది. ఇంప్రూవ్డ్ లో-లెవల్ లైట్‌వెయిట్ రాడార్ (ఎల్‌ఎల్‌ఎల్‌ఆర్-1) వ్యవస్థలను సమకూర్చుకోవడమే ఈ ఒప్పందం లక్ష్యం. ఈ రాడార్లు సైన్యం వైమానిక రక్షణ సామర్థ్యాన్ని పెంచనున్నాయి. ఈ రాడార్లతో యుద్ధ విమానాల పరిమాణంలో ఉండే లక్ష్యాలతో పాటు చిన్న, అతి చిన్న డ్రోన్లను గుర్తించి వాటి కదలికలను పర్యవేక్షించవచ్చు. గగనతలంలో గుర్తించిన లక్ష్యాల్లో ఏవి ఎక్కువ ప్రాధాన్యంతో ఎదుర్కోవాలో నిర్ణయించేందుకు

2లో..

# అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో భారత పర్యటన

### 1. వాణిజ్య ఒప్పందం '99% పూర్తి'

భారత్–అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంపై 99 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన కొన్ని నిబంధనలను రాబోయే కొన్ని వారాల్లో ఖరారు చేసే అవకాశం ఉందని మార్కో రూబియో వెల్లడించారు.

విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌తో సమావేశం అనంతరం ఇరుదేశాలు ఈ ఒప్పందాన్ని త్వరగా ముగించేందుకు కట్టుబడి ఉన్నట్లు ప్రకటించాయి.ప్రయోజనం: ఈ ఒప్పందం పూర్తయితే భారత ఎగుమతిదారులకు అమెరికా మార్కెట్‌లో భారీ ఊరట లభిస్తుంది. చైనాకు ప్రత్యామ్నాయంగా భారత్ విశ్వసనీయ భాగస్వామిగా ఎదుగుతుంది.ప్రతికూలత: నిలిచిపోయిన ఆ 1% సాంకేతిక, చట్టపరమైన నిబంధనలు తేలకపోతే మొత్తం ఒప్పందం వృథా అయ్యే ప్రమాదం ఉంది.

### 2. పాకిస్తాన్ పై 'ప్రశంసలు' - అమెరికా ద్వంద్వ వైఖరి

ఈ పర్యటనలో అత్యంత వివాదాస్పదమైన అంశం పాకిస్థాన్‌తో అమెరికా సంబంధాలు. పాకిస్థాన్ వద్ద ఉన్న అణ్వాయుధాలు, భౌగోళిక వ్యూహాత్మక ప్రాంతం కారణంగా వారితో చర్చలు జరపడం తమకు అవసరమని రూబియో సమర్థించుకున్నారు.

పాకిస్థాన్‌తో అమెరికా జరిపే చర్చలు భారత్‌కు నష్టం కలిగించమని, పైగా భారత్ ఆందోళనలను పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రయోజనం: భారత భద్రతా ఆందోళనలను పరిగణనలోకి తీసుకుంటామని వాషింగ్టన్ హామీ ఇచ్చింది.ప్రతికూలత: ఉగ్రవాద మూలాలున్న పాకిస్థాన్‌పై కఠిన వైఖరి తీసుకోకుండా, అమెరికా మెతక వైఖరిని చూపడం భారత్‌కు ఆందోళన కలిగించే అంశం.

### 3. రష్యా చమురు

రష్యాపై భారత్.. సైనిక, ఇంధన వనరుల కోసం ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని రూబియో సూచించారు. భారత్‌ను ఒక "రిఫైనింగ్ సూపర్ పవర్"గా ప్రశంసించిన ఆయన, అమెరికా, వెనిజులా నుండి చమురు కొనుగోళ్లను పెంచాలని ప్రతిపాదించారు. రష్యా చమురు కొనుగోళ్లపై అమెరికా సుంకాలు భారత్‌ను శిక్షించడానికి కాదని స్పష్టం చేశారు. ప్రయోజనం: తక్షణమే జరిమానాలు లేదా కఠిన నిబంధనలు ఉండవనే భరోసా దక్కింది. ప్రతికూలత: చౌకగా లభించే రష్యా చమురును వదులుకుని ఖరీదైన అమెరికా లేదా వెనిజులా చమురుకు మారడం భారత్‌కు ఆర్థికంగా భారమవుతుంది.

### 4. 26/11 బాధితులకు నివాళి - కానీ పాకిస్తాన్ పేరు ప్రస్తావన లేదు

ముంబై చేరుకున్న వెంటనే రూబియో 2008 దాడులు జరిగిన తాజ్ మహల్ ప్యాలెస్ హోటల్ వద్ద నివాళులర్పించారు. ఉగ్రవాద నెట్‌వర్క్‌లను నిర్మూలించాలని పిలుపునిచ్చినప్పటికీ, తన ప్రకటనలో ఎక్కడా పాకిస్తాన్ పేరును ప్రస్తావించకపోవడం గమనార్హం. ప్రయోజనం: ఉగ్రవాద వ్యతిరేక పోరాటంలో భారత్‌కు అమెరికా మద్దతు ఇస్తుందనే సందేశం వచ్చింది. ప్రతికూలత: 26/11 దాడుల్లో పాకిస్తాన్ పాత్రను బహిరంగంగా పేర్కొనకపోవడం దౌత్యపరమైన రాజీగా కనిపిస్తోంది.

### 5. 'వ్యూహాత్మక భాగస్వామ్యం' -సుంకాల ముప్పు

భారత్–అమెరికా బంధాన్ని రూబియో "అత్యంత ముఖ్యమైన వ్యూహాత్మక భాగస్వామ్యాలలో ఒకటి"గా చెప్పారు. రక్షణ, సాంకేతికత, ఇంధన రంగాలలో సహకారం పెంచుకోవాలని ఇరుదేశాలు భావిస్తున్నాయి. ప్రయోజనం: రక్షణ, సాంకేతిక రంగాలలో అమెరికా సహకారం పెరగడం వల్ల చైనా, పాకిస్తాన్‌ల సవాళ్లను ఎదుర్కోవడంలో భారత్ బలోపేతమవుతుంది. ప్రతికూలత: అమెరికా నుండి ఆయుధాలు, ఇంధన కొనుగోళ్లు పెంచాలని ఒత్తిడి తీసుకువస్తే అది భారత్ వాణిజ్య ప్రయోజనాలకు నష్టం కలిగించవచ్చు.

# ఎమ్మెల్సీ పోరు.. మిత్రపక్షాల అలక!

### ముందుగానే అభ్యర్థుల ప్రకటన

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. గెలుపే లక్ష్యంగా ముందస్తు వ్యూహాలతో అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ఉమ్మడి ఖమ్మం–వరంగల్–నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని, ఉమ్మడి హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్ స్థానానికి సామ రామ్మోహన్ రెడ్డిని అభ్యర్థులుగా ప్రకటించింది. అభ్యర్థులు ఇప్పటికే క్షేత్రస్థాయిలో ప్రచారానికి అవసరమైన గ్రౌండ్‌వర్క్ ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాల్లో కీలక నేతలను కలుస్తూ, సన్నాహక సమావేశాల్లో పాల్గొంటున్నారు.

### మిత్రపక్షాల్లో అసంతృప్తి

అయితే అభ్యర్థుల ప్రకటన కాంగ్రెస్‌కు కొత్త సవాలుగా మారింది. మిత్రపక్షాలైన తెలంగాణ జన సమితి, వామపక్ష పార్టీలను సంప్రదించకుండానే అభ్యర్థులను ప్రకటించారనే అసంతృప్తి వ్యక్తమైంది. ఉమ్మడి ఖమ్మం–వరంగల్–నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానంపై తెలంగాణ జన సమితి ఆశలు పెట్టుకోగా ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో వామపక్ష పార్టీలకు ఉన్న రాజకీయ ప్రాధాన్యం కూడా కీలకంగా మారింది. తమతో చర్చించకుండా నిర్ణయం తీసుకోవడంపై మిత్రపక్షాలు అసంతృప్తిగా ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మరోవైపు, సీపీఎం, సీపీఐ కలిసి ఉమ్మడి అభ్యర్థిని బరిలోకి దించే ఆలోచన చేసినట్లు కూడా ప్రచారం జరిగింది.

### మిత్రపక్షాల మద్దతు కోసం పీసీసీ చీఫ్ ప్రయత్నాలు

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మిత్రపక్షాల మద్దతు కీలకమని భావిస్తున్న కాంగ్రెస్ నాయకత్వం అసంతృప్తి మరింత పెరగకుండా దిద్దుబాటు చర్యలకు దిగింది.

ఇందులో భాగంగా పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్వయంగా తెలంగాణ జన సమితి, సీపీఎం నేతలను కలిసి కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరినట్లు సమాచారం. రాజకీయంగా మిత్రపక్షాలు ప్రస్తావించిన డిమాండ్లపై కూడా చర్చించి సానుకూల నిర్ణయం తీసుకునే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే క్రమంలో సీపీఐతోనూ చర్చలు జరిపి మిత్రపక్షాల మద్దతును కూడగట్టేందుకు కాంగ్రెస్ సిద్ధమైంది.

### సమన్వయమే కీలకం!

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు కోసం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ప్రకటనతో పాటు మిత్రపక్షాల మద్దతుపైనా దృష్టి సారించింది.

అయితే అభ్యర్థుల ఎంపికతో ఏర్పడిన అసంతృప్తిని కాంగ్రెస్ నాయకత్వం ఎంతవరకు పరిష్కరిస్తుంది? మిత్రపక్షాలు కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతు ఇస్తాయా.? ఎన్నికల నాటికి పార్టీల మధ్య సమన్వయం ఏ స్థాయికి చేరుతుంది.? అన్నది ఆసక్తికరంగా మారింది. మిత్రపక్షాల మద్దతు, ఓట్ల సమీకరణ ఈ ఎన్నికల్లో కీలకంగా మారనున్నాయి.

# బియ్యం కొనేదెట్టా.? కూడు తినేదెట్టా.?

సంక్రాంతి అభిప్రాయపడుతున్నారు.

### మార్కెట్ నిఘా బలోపేతం చేయాలి

బియ్యం ధరల పెరుగుదలను నియంత్రించేందుకు ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మార్కెట్‌లో నిల్వలు, సరఫరా, డిమాండ్, ధరల మార్పులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించే మార్కెట్ ఇంటెలిజెన్స్ వ్యవస్థను బలోపేతం చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

కృత్రిమ కొరతకు తావులేకుండా సరఫరా వ్యవస్థను పర్యవేక్షించడంతో పాటు, ధరల పెరుగుదలకు కారణాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ధాన్యం ఉత్పత్తిలో ముందున్న తెలంగాణలోనే బియ్యం సామాన్యులకు భారంగా మారకుండా ప్రభుత్వం జోక్యం చేసుకుంటుందా? ధరల నియంత్రణకు ఎలాంటి చర్యలు చేపడుతుందా? అన్నది ఇప్పుడు కీలకంగా మారింది.

# 2028లోగా పోలీస్ శాఖలో ఖాళీలన్నింటిని భర్తీ చేస్తాం

కల్తీ వంటి మారుతున్న నేర స్వభావాలు, సవాళ్లను ఎదుర్కోవడంలో పోలీసు శాఖను బలోపేతం చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.

### పోలీసు అమరవీరుల త్యాగాలను మరచిపోలేం

శాంతి భద్రతల ప్రాధాన్యత, పోలీసుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.'పోలీసు అమరవీరుల సంస్మరణ దినం ఎంతో భావోద్వేగమైన రోజు. సమాజం కోసం ప్రాణాలను త్యాగం చేసిన పోలీసు అమరులకు నివాళులు. శాంతిభద్రతల పరిరక్షణలో వారి త్యాగాలను మరువలేనివి. అమరుల కుటుంబాలు ఒంటరి కాదు. వారికి ప్రభుత్వం అండగా ఉంటుంది'అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. దేశవ్యాప్తంగా ఈ ఏడాది విధి నిర్వహణలో 154 మంది పోలీసు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేస్తూ'వారి త్యాగాలను ఎప్పటికీ మరిచిపోలేం. వారందరికీ హృదయపూర్వక నివాళులు. కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను'అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

### ప్రజా ప్రభుత్వం పోలీస్ శాఖకు అత్యంత ప్రాధాన్యతనిస్తోంది

'ప్రాణ త్యాగం చేసిన వారి కుటుంబాల బాధలను పూర్తిగా తీర్చలేకపోవచ్చు. కానీ వారికి ప్రభుత్వం అండగా ఉంటుంది. పిల్లల చదువు, భద్రత విషయంలో ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుంది. మానవీయ కోణంలో నిర్ణయాలు తీసుకుంటుంది'అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు.'రాష్ట్రం అభివృద్ధి సాధించాలంటే పెట్టుబడులు ఒక్కటే సరిపోవు. రోడ్లు భవనాలు నిర్మిస్తే అభివృద్ధి కాదు. ప్రజలు నిర్భయంగా జీవించినప్పుడే ఆ రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుంది. పరిశ్రమలు రావాలన్నా, పెట్టుబడులు పెరగాలన్నా, ఐటీ, పర్యాటకం అభివృద్ధి చెందాలంటే.. శాంతిభద్రతల పరిరక్షణ ఎంతో ముఖ్యం. అందుకే ప్రజా ప్రభుత్వం పోలీస్ శాఖకు అత్యంత ప్రాధాన్యతనిస్తోంది'అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

### పోలీసు శాఖలో సిబ్బంది కొరతను అధిగమిస్తాం

'పోలీసు శాఖను బలోపేతం చేయడానికి 2025 అక్టోబర్ నాటికే దాదాపు 16 వేల మంది కానిస్టేబుళ్లు ఎస్ఐలను నియమించాం. సిబ్బంది కొరతను తగ్గించడానికి కొత్త నియామకాలు చేపడుతున్నాం. 2026లో పోలీస్ శాఖలో మరో 5 వేల ఉద్యోగాల భర్తీకి అనుమతించాం'అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 'విడతలవారిగా భర్తీ చేసుకుంటూ 2028 లోగా పోలీస్ శాఖలో అన్ని భర్తీ చేసి పోలీసు శాఖలో సిబ్బంది కొరత అన్నది లేకుండా చేస్తాం. ఉమ్మడి రాష్ట్రంలో సైతం ఎన్నడూలేని విధంగా 112 మంది డీఎస్పీలను నియమించాం. దేశంలో ఎక్కడా లేనివిధంగా ట్రాన్స్‌జెండర్స్‌ను ట్రాఫిక్ అసిస్టెంట్లుగా నియమించి వారి ఆత్మగౌరవాన్ని పెంచాం'అని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

### వీరమరణం పొందిన కానిస్టేబుళ్లకు రూ.కోటి ఎక్స్ గ్రేషియా

'విధి నిర్వహణలో వీరమరణం పొందిన కానిస్టేబుళ్లకు గతంలో రూ. 40 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఉంటే దాన్ని ఏకంగా రూ. 1 కోటికి పెంచాం. హెడ్–కానిస్టేబుళ్లు, ఏఎస్ఐలకు గతంలో రూ. 45 లక్షలుగా ఉన్న పరిహారాన్ని రూ. 1 కోటికి పెంచాం. ఎస్ఐలకు రూ. 45 లక్షలు, ఇన్‌స్పెక్టర్లకు రూ. 50 లక్షలు ఉంటే దీనిని రూ. 1.25 కోట్లకు పెంచాం'అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 'డీఎస్పీ, అడిషనల్ ఎస్పీ స్థాయి అధికారులకు రూ. 50 లక్షలు ఉంటే రూ. 1.50 కోట్లు పెంచాం. ఎస్పీ, ఐపీఎస్ అధికారులకు 1 కోటి రూపాయలు పరిహారం ఉంటే దానిని రూ. 2 కోట్లకు పెంచడం జరిగింది. ఇది కేవలం ఆర్థిక సహాయం కాదు. పోలీసు అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం ఇచ్చే గౌరవం. మరింత ఆర్థిక భద్రత కల్పించడంతో పాటు వారి త్యాగాలను గుర్తించడం, వారి కుటుంబాలకు అండగా నిలవడం ప్రభుత్వ తొలి ప్రాధాన్యత'అని సీఎం రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు.

### ప్రాణాలు కోల్పోయిన హోంగార్డుల ఎక్స్‌గ్రేషియా రూ.10 లక్షలకు పెంపు

'అమరుల కుటుంబాల్లో అర్హులైన ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించడంతో పాటు, ఇంటి స్థలం ఉచిత విద్య, వైద్య సహాయం అందిస్తున్నాం. వైద్య విద్యలో ప్రత్యేక సీట్లను అమలు చేస్తున్నాం. భద్రత సంక్షేమ నిధి నుంచి రూ 16 లక్షలు, సంక్షేమ నిధి నుంచి మరో రూ. 8 లక్షల అందించాలని నిర్ణయించాం'అని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. 'విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన హోంగార్డుల కుటుంబాలకు రూ. 5 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందిస్తున్నాం. ఈ ఎక్స్‌గ్రేషియాను రూ. 10 లక్షలకు పెంచాలని డీజీపీని ఆదేశిస్తున్నా. హోంగార్డుల వైద్య పరీక్షలకు ప్రాధాన్యత ఇవ్వాలి. హోదా ఏదైనా ప్రతి ఒక్కరి కష్టాన్ని ప్రభుత్వం గుర్తిస్తుంది'అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

### యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ప్రారంభం

'పోలీసు శాఖలో హోంగార్డు స్థాయి నుంచి డీజీపీ స్థాయి వరకు వారి పిల్లలు చదువుకోవడానికి రంగారెడ్డి జిల్లా మంచిరేవుల ప్రాంతంలో 44 ఎకరాల్లో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను ప్రారంభించాం'అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు.'డ్రగ్స్, గంజాయి వ్యాప్తి అత్యంత ప్రమాదకరంగా మారుతోంది. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైన ఉంది. డ్రగ్స్ నియంత్రణలో ఈగల్ తెలంగాణ పనితీరును, డీజీపీ అనితీరు అద్భుతం'అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కల్తీ ఆహారంపై ఉక్కు పాదంతో అణచివేసేందుకు కొత్తగా టీజీ సేఫ్ ను ప్రారంభించాం. అలాగే షీ టీమ్స్ సేవలను కొనసాగిస్తూ మహిళల భద్రతను మరింత బలోపేతం చేస్తున్నాం అని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు.'మహిళలకు అండగా నిలవాలనే సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు 'స్టాండ్ విత్ హెర్' కార్యక్రమాన్ని ఈ ఏడాది మార్చిలో ప్రారంభించాం. మహిళలు, పిల్లలకు అత్యవసర పరిస్థితుల్లో తక్షణ రక్షణ అందించడానికి ఏప్రిల్‌లో స్పందన – తక్షణ రక్షణ బృందాలను ప్రారంభించాం'అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.

### అమరులైన పోలీసు కుటుంబాల సభ్యులకు ఆర్థిక సహాయం

'పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులతో ప్రత్యేకంగా ఒక మాట చెప్పాలనుకుంటున్నా. మీరు కోల్పోయిన వ్యక్తిని ఎవరూ తిరిగి తీసుకురాలేం. మీ కుటుంబాల్లో ఏర్పడిన లోటును ఎవరూ పూర్తిగా భర్తీ చేయలేరు. కానీ మీ బాధలో మీరు ఒంటరివారు కాదు. మీకు తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుంది. పోలీసు శాఖ అండగా ఉంటుంది. తెలంగాణ సమాజం అండగా ఉంటుంది'అని సీఎం రేవంత్ రెడ్డి భరోసానిచ్చారు.'ఈ రోజు పోలీసు శాఖలో పనిచేస్తున్న ప్రతి అధికారి, ప్రతి సిబ్బందికి ఒక మాట మీ క్రమశిక్షణే మీ బలం. మీ నిజాయితీయే మీ గౌరవం. ప్రజలకు మీరు అందించే భరోసాయే మీకు లభించే గొప్ప గుర్తింపు. ప్రజల భద్రతకు మీరు అండగా నిలవండి. మీ సంక్షేమానికి, మీ కుటుంబాల భవిష్యత్తుకు ఈ ప్రభుత్వం అండగా ఉంటుంది. అమరులను గౌరవించడమంటే కేవలం నివాళులు అర్పించడం కాదు.

అమరుల త్యాగాలను గౌరవించడం, వారి కుటుంబాలకు అండగా నిలవడం కూడా అంతే ప్రాధాన్యమైనవి.ఫ్రెండ్లీ పోలిసింగ్ అమలు చేసే విషయంలోనే అసలు విషయం దాగి ఉంది. సమస్య పరిష్కారమవుతుందని పోలీసులపై నమ్మకంతో వచ్చే సామాన్యులతో ఫ్రెండ్లీగా వ్యవహరించాలి. క్రిమినల్స్‌తో కఠినంగా వ్యవహరించాలి'అని సీఎం రేవంత్ రెడ్డి ఉద్బోధించారు.ఈ కార్యక్రమంలో డీజీపీ సీవీ ఆనంద్‌తోపాటు పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ ఏడాది అమరులైన పోలీసు కుటుంబాల సభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందించారు.

# ఖజానాకు కిక్కు

నేపథ్యంలో మద్యం కొనుగోళ్లు పెరగడం ఈ గణాంకాల్లో ప్రతిబింబిస్తోంది. ఈ నెల ప్రారంభంలో అమ్మకాలు కొంత నెమ్మదిగా సాగినప్పటికీ రెండో వారం నుంచి విక్రయాలు భారీగా పెరిగినట్లు లెక్కలు చెబుతున్నాయి.అక్టోబర్ 16వ తేదీ నాటికి రూ.1,527.85 కోట్లుగా ఉన్న మొత్తం అమ్మకాల విలువ అక్టోబర్ 19వ తేదీ నాటికి రూ.2 వేల కోట్లను దాటింది. దీంతో దసరా సీజన్‌లో మద్యం విక్రయాలపై మరోసారి చర్చ మొదలైంది. ఈసారి మద్యం విక్రయాల్లో బీర్ల వాటా ప్రత్యేకంగా కనిపిస్తోంది. అక్టోబర్ 1వ తేదీ నుంచి 19వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా 30.37 లక్షల కేసుల బీర్లు అమ్ముడు అయ్యాయి. గత ఏడాది ఇదే కాలంలో ఈ సంఖ్య 21.55 లక్షల కేసులుగా ఉంది. అంటే ఈసారి 8.82 లక్షల కేసుల బీర్లు అదనంగా విక్రయం అయ్యాయి. బీర్ల అమ్మకాల్లో 40.93 శాతం వృద్ధి నమోదైనట్లు ఎక్సైజ్ శాఖ గణాంకాలు చెబుతున్నాయి.ఇక ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్ (ఐఎంఎఫ్ఎల్) విక్రయాలు కూడా పెరిగాయి. గత ఏడాది ఇదే కాలంలో 14.16 లక్షల కేసులుగా ఉన్న అమ్మకాలు ఈసారి 18.38 లక్షల కేసులకు చేరుకున్నాయి. ఈసారి మద్యం విక్రయాల్లో 29.80 శాతం వృద్ధి నమోదైంది. మొత్తంగా బీర్లు, ఇతర మద్యం రకాల విక్రయాలు రెండింటిలోనూ పెరుగుదల కనిపించింది.దసరా సీజన్‌లో రోజువారీ విక్రయాలు కూడా గణనీయంగా పెరిగాయి. అక్టోబర్ 19వ తేదీన ఒక్కరోజే రూ.303.40 కోట్ల విలువైన మద్యం విక్రయాలు నమోదు అయ్యాయి. గత ఏడాది ఇదే రోజుతో పోలిస్తే అమ్మకాల విలువలో 801.90 శాతం వృద్ధి నమోదైనట్లు అందించిన గణాంకాలు పేర్కొంటున్నాయి. తెలంగాణ ప్రభుత్వానికి ఎక్సైజ్ శాఖ ఆదాయం సమకూర్చే ముఖ్యమైన విభాగాల్లో ఒకటి. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో మద్యం విక్రయాలు పెరిగినప్పుడు ప్రభుత్వానికి వచ్చే ఆదాయంపైనా సర్వత్రా ఆసక్తి పెరుగుతుంది.

# మళ్లీ భగ్గుమన్న క్రూడ్ ఆయిల్

### - బ్యారెల్ 110 డాలర్లకు చేరిక

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు మరోసారి భగ్గుమన్నాయి. అమెరికా–ఇరాన్ మధ్య శాంతి ఒప్పందంపై నెలకొన్న అనిశ్చితి కారణంగా, బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 110 డాలర్ల మార్కును దాటింది. దీంతో చమురు సరఫరాపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. బుధవారం నాటి ట్రేడింగ్‌లో బ్రెంట్ క్రూడ్ ధర ఒక శాతానికి పైగా పెరిగి బ్యారెల్ 110.15 డాలర్లకు చేరుకుంది. మరోవైపు, వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ (డబ్ల్యూటీఐ) ధర మంగళవారం బ్యారెల్ 101.79 డాలర్ల వద్ద ముగిసింది. మంగళవారం ధరలు స్వల్పంగా తగ్గినప్పటికీ, తాజా పరిణామాలతో మళ్లీ ఎగబాకాయి.ఇరాన్‌తో శాంతి ఒప్పందం కుదరడం అత్యంత క్లిష్టమని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో వ్యాఖ్యానించారు. హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై దాడులు నిలిచిపోయే వరకు ఇరాన్‌పై ఆర్థిక ఒత్తిడి కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. దీనిపై ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి స్పందిస్తూ, అమెరికా తమ షరతులను అంగీకరించే వరకు హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరిచే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. అణ్వస్త్ర సామగ్రిని రష్యా నియంత్రణకు అప్పగించే ప్రతిపాదనను కూడా ఇరాన్ తిరస్కరించింది. పరస్పర విరుద్ధ ప్రకటనలతో ఇరు దేశాల మధ్య చర్చల్లో ప్రతిష్టంభన నెలకొంది. ఈ ఉద్రిక్తతల ప్రభావంతోనే చమురు ధరలు పెరుగుతున్నాయని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# సౌరవ్ దాస్, అశుతోష్ రంకాలకు ఊరట

దీప్కే స్పందించారు. షారుఖ్ ఖాన్ నటించిన 'చక్ దే ఇండియా' సినిమా క్లైమాక్స్ సన్నివేశానికి సంబంధించిన ఒక వీడియో క్లిప్‌ను తన 'ఎక్స్' ఖాతాలో ఆయన పంచుకున్నారు.

### ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంచుకోండి.. హైకోర్టు

అంతకుముందు రోజు, దాస్, రంకా తమ కస్టడీ పొడిగింపును సవాలు చేస్తూ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. మేజిస్ట్రేట్ నిర్ణయం వచ్చే వరకు వేచి చూడాలని, తమ సమస్య అలాగే ఉంటే తగిన అప్పీలేట్ లేదా రివిజన్ ఫోరమ్‌ను సంప్రదించాలని కోర్టు వారిని కోరింది. దీంతో వారు తమ పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. ప్రత్యామ్నాయ న్యాయపరమైన మార్గం అందుబాటులో ఉన్నప్పుడు రాజ్యాంగంలోని ఆర్టికల్ 226 ప్రకారం నేరుగా రిట్ పిటిషన్ ఎందుకు దాఖలు చేశారని ఢిల్లీ హైకోర్టు ప్రశ్నించింది.

"ఇది రెండో సంఘటన. మీరు గతంలో పూచీకత్తు నిబంధనలను ఉల్లంఘించారు. మీ అసలు పరిష్కారం రివిజన్ పిటిషన్‌లోనే ఉంది' అని మేజిస్ట్రేట్ అక్టోబర్ 19న ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా హైకోర్టు వ్యాఖ్యానించింది. శాంతి భద్రతల బాండ్‌ను రెండోసారి ఉల్లంఘిస్తే కఠినమైన పూచీకత్తు షరతులను విధించే హక్కు అధికారులకు ఉంటుందా? అని కూడా ధర్మాసనం ప్రశ్నించింది.జంతర్ మంతర్ వద్ద బారికేడ్లను బద్దలు కొట్టడం వల్ల బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 కింద అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను ఇతరులు కూడా ఉల్లంఘించే ప్రమాదం ఉందని కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. "ఇక్కడ ఉన్న ఇద్దరు పిటిషనర్లు ముందుండి నడిపిస్తున్నారు. మీరు వెళ్లి బారికేడ్‌ను బద్దలు కొట్టినప్పుడు, మరికొంతమంది సెక్షన్ 163ను ఉల్లంఘించే అవకాశాలు చాలా ఎక్కువగా ఉంటాయి" అని కోర్టు పేర్కొంది. ఈ క్రమంలోనే సీజేపీ నేతల వయసుపై న్యాయమూర్తి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. దీనికి అభిజీత్ దీప్కే ప్రధాని మోదీ ఒక్కరే జెన్ జీ అంటూ తనదైన శైలిలో వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

# డ్రోన్ల ఆట కట్టించేందుకు ఆర్మీకి కొత్త రాడార్లు

కూడా ఈ వ్యవస్థ ఉపయోగపడుతుంది. దీంతో మానవరహిత వైమానిక వ్యవస్థల (యూఏఎస్) నుంచి ఎదురయ్యే ముప్పులను ఎదుర్కోవడంలో సైన్యానికి సహాయం అందనుంది. రక్షణ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్ సమక్షంలో ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి.దేశీయ రక్షణ ఉత్పత్తుల తయారీని పెంచాలన్న లక్ష్యంలో భాగంగా ఈ కొనుగోలు చేపట్టినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. దీనివల్ల దేశీయ రక్షణ పరిశ్రమతో పాటు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలకు (ఎంఎస్ఎంఈలు) కూడా అవకాశాలు పెరిగే వీలుంది. గత దశాబ్దంలో భారత్ రక్షణ ఉత్పత్తుల తయారీలో గణనీయమైన వృద్ధిని సాధించింది. అధికారిక గణాంకాల ప్రకారం.. 2013–14 ఆర్థిక సంవత్సరంలో రూ.4,746 కోట్లుగా ఉన్న రక్షణ ఉత్పత్తుల విలువ 2025–26లో రూ.1.78 లక్షల కోట్లకు చేరింది. అదే సమయంలో రక్షణ ఎగుమతులు రూ.686 కోట్ల నుంచి రూ.38,424 కోట్లకు పెరిగాయి. భారత రక్షణ పరికరాలు ప్రస్తుతం 80కి పైగా దేశాలకు ఎగుమతి అవుతున్నాయి.2029 నాటికి ఏటా రూ.3 లక్షల కోట్ల రక్షణ ఉత్పత్తుల తయారీ, రూ.50 వేల కోట్ల ఎగుమతులు సాధించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. రక్షణ రంగ పరిశోధన, అభివృద్ధికి కేటాయింపులను కూడా పెంచింది. 2026–27లో ఈ కేటాయింపులు రూ.29,100.25 కోట్లకు చేరాయి. పరిశ్రమలు, స్టార్టప్‌లు, విద్యాసంస్థలు కొత్త రక్షణ సాంకేతికతలను అభివృద్ధి చేసేందుకు పరిశోధన బడ్జెట్‌లో 25 శాతాన్ని అందుబాటులో ఉంచింది.

# నిత్యవసరాల ధరలకు కళ్లెం వేయండి




**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల వేళ అధికార కూటమిలో రెబల్ అభ్యర్థుల వ్యవహారం రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పార్టీ నిర్ణయాన్ని కాదని స్వతంత్రంగా బరిలో నిలిచే అభ్యర్థులు వెంటనే నామినేషన్లు ఉపసంహరించుకోవాలని తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. మాట వినకుండా పోటీలో కొనసాగితే పార్టీ పరంగా క్రమశిక్షణ చర్యలు తప్పవని అవసరమైతే సస్పెన్షన్ వేటు వేస్తామని హెచ్చరించారు. కూటమి అభ్యర్థుల విజయానికి అడ్డంకులు లేకుండా చూడాలని పార్టీ ముఖ్య నేతలకు దిశానిర్దేశం చేశారు. స్థానిక ఎన్నికల ప్రచారం, అభ్యర్థుల ఎంపిక, కూటమి పార్టీల మధ్య సమన్వయం వంటి అంశాలపై పార్టీ ముఖ్య నేతలతో సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పార్టీ అధికారిక అభ్యర్థులకు వ్యతిరేకంగా నామినేషన్లు వేసిన వారితో మాట్లాడి పోటీ నుంచి తప్పుకునేలా చూడాలని సూచించారు. రెబల్ అభ్యర్థుల కారణంగా ఓట్లు చీలిపోకుండా కూటమి అభ్యర్థుల విజయావకాశాలకు ఇబ్బంది కలగకుండా నాయకులు చొరవ తీసుకోవాలని ఆదేశించారు.టీడీపీతో పాటు కూటమిలోని జనసేన, బీజేపీ అధికారిక అభ్యర్థులు పోటీ చేస్తున్న స్థానాల్లోనూ పరస్పర అవగాహనతో వ్యవహరించాలని చంద్రబాబు స్పష్టం చేశారు. మిత్రపక్షాల మధ్య సీట్ల సర్దుబాటు విషయంలో స్థానిక నాయకులు వివాదాలకు తావివ్వకుండా చూడాలని సూచించారు. 3 పార్టీల నాయకులు వేర్వేరుగా అభ్యర్థులను నిలబెట్టడం కంటే, కూటమి నిర్ణయించిన అభ్యర్థుల విజయానికి సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. స్థానిక ఎన్నికల్లోనూ ప్రజల మద్దతు పొందేందుకు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని చంద్రబాబు నేతలకు సూచించారు. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు గురించి ప్రజలకు వివరించాలని చెప్పారు. 'చెప్పాం.. చేస్తున్నాం' అనే నినాదంతో ఇంటింటి ప్రచారం నిర్వహించి కూటమి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయాలని దిశానిర్దేశం చేశారు.ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉండే నాయకులను అభ్యర్థులుగా ఎంపిక చేయాలని సీఎం చంద్రబాబు సూచించారు. పార్టీ తరఫున పోటీ చేయాలని ఆశించినప్పటికీ టికెట్ దక్కని నాయకులు, కార్యకర్తలు నిరాశ చెందవద్దని ఈ సందర్భంగా చంద్రబాబు సూచించారు. అర్హత, అనుభవం, సేవా దృక్పథం ఉన్నవారికి భవిష్యత్తులో నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించే అంశాన్ని పరిశీలిస్తామని భరోసా ఇచ్చారు. అయితే పార్టీ నిర్ణయాన్ని ధిక్కరించి రెబల్‌గా పోటీలో కొనసాగడాన్ని మాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఈ హెచ్చరికతో అసంతృప్త నేతలను బుజ్జగించి, అధికారిక అభ్యర్థుల తరఫున పనిచేసేలా చేయడం టీడీపీ నాయకత్వానికి ముఖ్యమైన బాధ్యతగా మారింది. నామినేషన్ల ఉపసంహరణ దశలో స్థానికంగా తలెత్తిన విభేదాలను పరిష్కరించి, కూటమి భాగస్వాముల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయాలని చంద్రబాబు నేతలకు సూచించారు.మరోవైపు ఆంధ్రప్రదేశ్ పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియపై కూడా న్యాయపరమైన పరిణామాలు చోటుచేసుకున్నాయి. కొందరు అభ్యర్థులను నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకున్నారన్న వైఎస్సార్‌సీపీ ఫిర్యాదుల నేపథ్యంలో తుది అభ్యర్థుల జాబితా ప్రచురణను అక్టోబర్ 26వ తేదీ వరకు నిలిపివేయాలని సుప్రీంకోర్టు ఇవాళ ఆదేశించింది. ఫిర్యాదులను పరిశీలించి నామినేషన్ల గడువు పొడిగింపుపై నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని కోరింది. అభ్యర్థులకు తగిన భద్రత కల్పించాలని పోలీసు యంత్రాంగానికీ సూచించింది.

## చెప్పాం.. చేస్తున్నాం' నినాదంతో ప్రజల్లోకి

సర్దుబాటు విషయంలో స్థానిక నాయకులు వివాదాలకు తావివ్వకుండా చూడాలని సూచించారు. 3 పార్టీల నాయకులు వేర్వేరుగా అభ్యర్థులను నిలబెట్టడం కంటే, కూటమి నిర్ణయించిన అభ్యర్థుల విజయానికి సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. స్థానిక ఎన్నికల్లోనూ ప్రజల మద్దతు పొందేందుకు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని చంద్రబాబు నేతలకు సూచించారు. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు గురించి ప్రజలకు వివరించాలని చెప్పారు. 'చెప్పాం.. చేస్తున్నాం' అనే నినాదంతో ఇంటింటి ప్రచారం నిర్వహించి కూటమి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయాలని దిశానిర్దేశం చేశారు.ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉండే నాయకులను అభ్యర్థులుగా ఎంపిక చేయాలని సీఎం చంద్రబాబు సూచించారు. స్థానిక సమస్యలపై అవగాహన, ప్రజలకు సేవ చేయాలనే తపన, ప్రజాదరణ ఉన్నవారికి ప్రాధాన్యం ఇవ్వాలని నేతలకు చెప్పారు. కూటమి అభ్యర్థుల విజయానికి పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. పార్టీ తరఫున పోటీ చేయాలని ఆశించినప్పటికీ టికెట్ దక్కని నాయకులు, కార్యకర్తలు నిరాశ చెందవద్దని ఈ సందర్భంగా చంద్రబాబు సూచించారు. అర్హత, అనుభవం, సేవా దృక్పథం ఉన్నవారికి భవిష్యత్తులో నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించే అంశాన్ని పరిశీలిస్తామని భరోసా ఇచ్చారు. అయితే పార్టీ నిర్ణయాన్ని ధిక్కరించి రెబల్‌గా పోటీలో కొనసాగడాన్ని మాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఈ హెచ్చరికతో అసంతృప్త నేతలను బుజ్జగించి, అధికారిక అభ్యర్థుల తరఫున పనిచేసేలా చేయడం టీడీపీ నాయకత్వానికి ముఖ్యమైన బాధ్యతగా మారింది. నామినేషన్ల ఉపసంహరణ దశలో స్థానికంగా తలెత్తిన విభేదాలను పరిష్కరించి, కూటమి భాగస్వాముల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయాలని చంద్రబాబు నేతలకు సూచించారు.మరోవైపు ఆంధ్రప్రదేశ్ పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియపై కూడా న్యాయపరమైన పరిణామాలు చోటుచేసుకున్నాయి. కొందరు అభ్యర్థులను నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకున్నారన్న వైఎస్సార్‌సీపీ ఫిర్యాదుల నేపథ్యంలో ఆ అభ్యర్థుల జాబితా ప్రచురణను అక్టోబర్ 26వ తేదీ వరకు నిలిపివేయాలని సుప్రీంకోర్టు ఇవాళ ఆదేశించింది. ఫిర్యాదులను పరిశీలించి నామినేషన్ల గడువు పొడిగింపుపై నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని కోరింది. అభ్యర్థులకు తగిన భద్రత కల్పించాలని పోలీసు యంత్రాంగానికి సూచించింది.

## మంగళగిరి మేయర్ పీఠంపై 'మైత్రి' ముద్ర.?

### టీడీపీ పరిశీలనలో యువ వైద్యురాలి పేరు



మంగళగిరి(ప్రశ్న న్యూస్) మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ తొలి మేయర్ పీఠం చుట్టూ రాజకీయ చర్చ ఆసక్తికరంగా మారుతోంది. ఎస్టీ రిజర్వేషన్ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ఎంపికపై కసరత్తు సాగిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో యువ వైద్యురాలు డాక్టర్ జగన్నాథం మైత్రి పేరు తెరపైకి వచ్చినట్లు తెలుస్తోంది. ఉన్నత విద్య, ప్రభుత్వ ఉన్నతాధికారులుగా పనిచేస్తున్న తల్లిదండ్రుల నేపథ్యం, మంగళగిరితో కుటుంబ అనుబంధం.. ఇలా పలు అంశాలు ఆమె పేరుపై చర్చకు కారణమవుతున్నాయి. అయితే మైత్రి పేరును టీడీపీ అధిష్ఠానం అధికారికంగా ఖరారు చేసినట్లు ప్రకటన వెలువడలేదు. దీంతో ఈ ప్రచారానికి పార్టీ నిర్ణయం ఎలాంటి ముగింపు పలుకుతుందన్న ఉత్కంఠ నెలకొంది.

### ఉన్నతాధికారుల కుటుంబం.. విద్యకు పెద్దపీట..

డాక్టర్ మైత్రి తండ్రి జగన్నాథం పార్థసారథి, తల్లి కుసుమ శ్రీదేవి ఇద్దరూ ప్రభుత్వ సేవలో ఉన్నతస్థాయికి ఎదిగినవారు. సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన వీరు ఉన్నత విద్యను అభ్యసించి, పోటీ పరీక్షల్లో విజయం సాధించి ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. పార్థసారథి ప్రస్తుతం డిప్యూటీ కలెక్టర్ హోదాలో గుంటూరు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారిగా పనిచేస్తుండగా, శ్రీదేవి ప్రభుత్వ సేవలో డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారిణిగా బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ వివరాలు తెలియజేస్తున్నాయి.

# దసరా రద్దీ..

## జాతీయ రహదారిపై వాహనాల బారులు

- పంతంగి టోల్‌ప్లాజా వద్ద భారీగా ట్రాఫిక్ జామ్
- హైదరాబాద్ బాట పట్టిన పండుగ ప్రయాణికులు



**చౌటుప్పల్(ప్రశ్న న్యూస్)** దసరా పండుగ సందడి ముగియడంతో హైదరాబాద్ నగరానికి తిరుగు ప్రయాణమైన ప్రజలతో విజయవాడ--హైదరాబాద్ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ ఒక్కసారిగా పెరిగింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద భారీగా వాహనాలు బారులు తీరాయి. దీంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ నెమ్మదిగా సాగుతూ ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

### పండుగ ముగిసింది.. ట్రాఫిక్ మొదలైంది!

దసరా సెలవుల నేపథ్యంలో హైదరాబాద్‌లో నివసించే అనేక కుటుంబాలు సొంతూళ్లకు వెళ్లి పండుగను జరుపుకున్నాయి. సెలవులు ముగియడంతో తిరిగి నగరానికి చేరుకునేందుకు బుధవారం పెద్ద సంఖ్యలో కార్లు, ఇతర వాహనాల్లో బయలుదేరారు. దీంతో విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే మార్గంలో వాహనాల సంఖ్య పెరిగింది. ముఖ్యంగా పంతంగి టోల్‌ప్లాజా వద్ద రద్దీ అధికమవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

### టోల్ ప్లాజా వద్ద వాహనాల క్యూ

టోల్ చెల్లింపు కేంద్రాల వద్ద వాహనాలు నెమ్మదిగా కదలడంతో వెనుక నుంచి వచ్చే వాహనాలు కూడా బారులు తీరాయి. కార్లు, బస్సులు, ఇతర వాహనాలతో జాతీయ రహదారి రద్దీగా మారింది. పండుగ అనంతరం ఒకేసారి పెద్ద సంఖ్యలో ప్రయాణికులు హైదరాబాద్‌కు బయలుదేరడంతో ఈ పరిస్థితి నెలకొంది. టోల్‌ప్లాజా దాటేందుకు వాహనదారులు కొంత సమయం వేచి ఉండాల్సి వచ్చింది.ట్రాఫిక్ రద్దీ నేపథ్యంలో వాహనదారులు ఓపికగా ప్రయాణించాలని, ముందున్న వాహనానికి తగిన దూరం పాటించాలని సూచిస్తున్నారు. తొందరపడి లేన్లు మార్చడం, ఇతర వాహనాల మధ్య నుంచి దూసుకెళ్లే ప్రయత్నం చేయడం ప్రమాదాలకు దారితీయవచ్చు. ప్రయాణానికి బయలుదేరే వారు రహదారి పరిస్థితులను ముందుగానే తెలుసుకుని, తగిన సమయాన్ని కేటాయించుకోవడం మంచిది.దసరా పండుగ అనంతరం తిరుగు ప్రయాణాలు కొనసాగుతున్న నేపథ్యంలో విజయవాడ--హైదరాబాద్ జాతీయ రహదారిపై రద్దీ మరింత పెరిగే అవకాశం ఉంది. పంతంగి టోల్‌ప్లాజా పరిసరాల్లో ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల సాఫీ రాకపోకలపై సంబంధిత అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

# జగన్ వేసిన ట్రాప్‌లో చంద్రబాబు చిక్కుకున్నారా

**పులివెందుల** స్థానిక సంస్థల ఎన్నికల్లో జరుగుతున్న ఘటనలు చూస్తుంటే టీడీపీ, వైసీపీలు రెండూ ఒకే బాట పయనిస్తున్నాయి. అరాచకాలలో ఒకరిని మించి మరొకరు అన్నట్లు వ్యవహరిస్తున్నారు. గతంలో వైఎస్ జగన్ పాలనపై విమర్శలు చేసే చంద్రబాబు నేడు జరుగుతున్న పరిస్థితులను అవతలి వారిపైకి నెట్టడం సమర్థనీయం కాదు. ఎన్నికలంటేే శాంతిభద్రతల సమస్య తలెత్తకూడదు. ఇప్పుడు జరుగుతున్న, జరిగిన పరిణామాలకు కూటమి ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుంది. అలాగే రాష్ట్ర ఎన్నికల కమిషన్ కూడా చేష్టలుడిగి చూస్తున్నట్లు కనిపిస్తుంది. ఇంత ఉదాసీన వైఖరి కారణంగా ఆంధ్రప్రదేశ్ లో ఇక ఏ ప్రభుత్వం వచ్చినా ఇవే పరిస్థితులు తలెత్తక మానవన్న కామెంట్స్ రాజకీయ విశ్లేషకులు కూడా చేస్తున్నారు.రాజకీయాలు చూడండి. అయితే ఇప్పుడు ఏపీలో మాత్రం అధికార పార్టీది, విపక్ష పార్టీది ఒకే దారి అన్నట్లు వ్యవహరిస్తున్నాయి. ఇప్పుడు వైసీపీ బాధిత పార్టీగా కనిపించవచ్చు. కానీ అదే తమ పాలనలో జగన్ ప్రభుత్వం అవలంబించిన చర్యలేవిటి? అని చంద్రబాబు ప్రశ్న కూడా అందరూ ఆలోచించాల్సిన విషయమే. అలాగే ఇదే విమర్శ రేపు చంద్రబాబు కూడా ఎదుర్కొనే పరిస్థితులు రావచ్చు. నాడు కుప్పం నియోజకవర్గంలో జగన్ చేసిన పని, నేడు పులివెందులలో టీడీపీ చేసింది. ఇందులో తప్పు వెతుక్కోవడానికి ఇద్దరిలోనూ వెతికినా కనిపించవు. కానీ జనం మాత్రం వీటిని గమనిస్తూనే ఉంటారన్న విషయాన్ని మాత్రం వైసీపీ, టీడీపీలు మర్చి పోకూడదు. ప్రజాస్వామ్యం మనుగడ కొనసాగించాలంటే రెండు పార్టీల అధినేతలు ఎవరికి వారే ఆత్మవిమర్శలు చేసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. స్థానిక సంస్థల ఎన్నికలను టీడీపీ, వైసీపీ లు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. అధికారంలో ఉన్న కూటమి పార్టీకి అత్యధిక స్థానాల్లో గెలుపు సాధించుకోవాలని సహజంగానే భావిస్తుంది. అదే సమయంలో వైసీపీ స్థానిక సంస్థల ఎన్నికల్లో కొంత బలోపేతం అయితే రానున్న సాధారణ ఎన్నికలకు పుంజుకుంటామని భావన కారణంగానే ఈ రకమైన పరిస్థితులు ఏర్పడ్డాయన్నది కాదనలేని వాస్తవం. స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి. అందులో తప్పులేదు. కానీ హింసా రాజకీయాలకు స్వస్తి పలకాలి. అనుభవమున్నచంద్రబాబు కు ఇది ఎంత మాత్రం అభిలషణీయం కాదు. ఒకరకంగా జగన్ వేసిన ట్రాప్ లో చంద్రబాబు చిక్కుకున్నారా? అన్న అనుమానం కూడా చాలా మంది సీనియర్ నేతల్లో వ్యక్తమవుతుంది. మొత్తం మీద ఆంధ్రప్రదేశ్ లో స్థానిక సంస్థల ఎన్నికల్లో మున్సిపల్ నామినేషన్ల సందర్భంగానే చూశాం. ఇక జడ్పీటీసీ, పంచాయతీ ఎన్నికల్లో ఇంకెంత రగడ చూడాలో.. .దేవుడా ఏపీకి నీవే దిక్కు. అని అనుకోవడం తప్ప చేసేదేమీ లేదు

**వ్యూహాలు ప్రతివ్యూహాలతో** ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికలలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ పాచికలు పారినట్లు కనపడుతుందివైఎస్ మోహన్ రెడ్డి వ్యూహాలు ప్రతివ్యూహాలతో సర్వసన్నద్ధమవుతున్నారు. కూటమి ప్రభుత్వానికి గట్టి పోటీ ఇచ్చేందుకు ఆయన వేస్తున్న అడుగులు రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ స్థానిక సంస్థల ఎన్నికలకు దూరంగా ఉంది. దీంతో తాడిపత్రి మున్సిపాలిటీ తప్పించి అన్నింటా వైసీపీ విజయం సాధించింది. అయితే ఇప్పుడు టీడీపీ పాలనపై వ్యతిరేకత తెచ్చేందుకు, తమ పార్టీపై సానుభూతి కురిసేందుకు జగన్ వేసిన వ్యూహం సక్సెస్ అయినట్లే కనపడుతుంది. ప్రతి చోట ఖచ్చితంగా నామినేషన్లు వేయాలని, ఏకగ్రీవం జరిగితే వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ కూడా ఇవ్వనని జగన్ నాడు చేసిన హెచ్చరికలను వేరే విధంగా చూసిన వారికి ఇప్పుడు అసలు విషయం అర్థమవుతుంది. జగన్ తన ఎత్తుగడలో భాగంగనే నామినేషన్లు వేయించి అభ్యర్థులను బరిలోకి దిగితే శాంతిభద్రతలు అదుపు తప్పి టీడీపీ పాలనపై వ్యతిరేకత ఏర్పడుతుందని అంచనా నిజమవుతుంది. గత రెండు రోజులుగా జరుగుతున్న నామినేషన్ల పర్వం చూస్తేనే ఇది ఎవరికైనా ఇట్టే అర్థమవుతుంది.మ్యాప్‌లు చూడండి ప్రతి సీటులోనూ పోటీకి... గత ఎన్నికల్లో జరిగిన పొరపాట్లను పునరావృతం కానివ్వకుండా, ఈసారి ప్రతి స్థానంలోనూ వైసీపీ అభ్యర్థిని పోటీకి నిలపాలని జగన్ పార్టీ శ్రేణులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఎక్కడా అధికార కూటమికి ఏకగ్రీవాలు చేసుకునే అవకాశం ఇవ్వకూడదని, ఒకవేళ ఏదైనా నియోజకవర్గంలో ఏకగ్రీవమైతే దానికి స్థానిక నాయకత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.కూటమి పార్టీలైన టీడీపీ, జనసేన, బీజేపీల మధ్య సీట్ల సర్దుబాటు చర్చలు పూర్తయి ఏ పార్టీ ఎక్కడ పోటీ చేయాలో అధికారికంగా ప్రకటించినప్పటికీ... వైఎస్ జగన్ మాత్రం ఒక అడుగు ముందే వేసి మొదటి విడతగా 27 మంది అభ్యర్థులతో కూడిన జాబితాను కూడా విడుదల చేశారు. గ్రౌండ్ రిపోర్టుల ఆధారంగా ప్రజాదరణ కలిగిన బలమైన అభ్యర్థులను ఎంపిక చేస్తూ కొత్త ఎత్తుగడలతో ముందుకు వెళ్తున్నారు.ఎన్నికల సమాచారం చూడండి.. ఎన్నికల సమయంలో అధికార యంత్రాంగం లేదా పోలీస్ వ్యవస్థల నుంచి ఎదురయ్యే ఒత్తిళ్లను, అక్రమాలను తట్టుకునేందుకు వీలుగా నియోజకవర్గాల వారీగా ప్రత్యేక లీగల్ సెల్స్, మీడియా సెల్స్‌ను ఏర్పాటు చేశారు. క్షేత్రస్థాయిలో ఏవైనా అధికార దుర్వినియోగ ఘటనలు జరిగితే వాటిని రికార్డ్ చేయడానికి 'డిజిటల్ డైరీ' విధానాన్ని తీసుకువచ్చారు.ఈ స్థానిక ఎన్నికలను కేవలం ఒక పోటీలా కాకుండా, మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత పార్టీని గ్రామ స్థాయి నుండి తిరిగి బలోపేతం చేసుకునే ఒక ప్రక్రియగా జగన్ భావిస్తున్నారు. అందుకోసం రీజనల్ కో-ఆర్డినేటర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లతో వరుస సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ ఎన్నికల్లో అధికార పార్టీ ఆగడాలు చూసి క్యాడర్ లోనూ కసి పెరుగుతుందని, అది తమకు వచ్చే సాధారణ ఎన్నికల్లో అనుకూలంగా మారుతుందని జగన్ అంచనా వేశారు. అనుకున్నట్లుగానే క్యాడర్ ఏకతాటిపైకి రావడంతో జగన్ పాచిక పారినట్లయింది. అధికార కూటమి సీట్ల సర్దుబాటు పూర్తి చేసుకుని పటిష్టంగా ఉన్న నేపథ్యంలో, జగన్ ముందస్తు వ్యూహాలు మరియు ఒంటరి పోరాటం క్షేత్రస్థాయిలో ఎంతవరకు ఓటర్లను ఆకర్షిస్తాయనే దానిపైనే ఆయన "పాచిక" సక్సెస్ ఆధారపడి ఉంటుంది. నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటే అది తమకు కలసి వస్తుందని అంచనా వేస్తున్నారు జగన్.

# నవంబర్ 1 నుంచి కాలింగ్ నేమ్ ప్రెజెంటేషన్

**న్యూఢిల్లీ,** భారత్‌లో మొబైల్ వినియోగదారులకు తెలియని నంబర్ల నుంచి వచ్చే కాల్స్‌ను గుర్తించడం మరింత సులభం కానుంది. 2026 నవంబర్ 1 నుంచి మొబైల్ ఫోన్లలో కాల్ చేసే వ్యక్తి పేరు కనిపించేలా కాలింగ్ నేమ్ ప్రెజెంటేషన్ వ్యవస్థను తప్పనిసరి చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు అందించిన సమాచారం వెల్లడిస్తోంది. ఈ విధానం ద్వారా ఫోన్ నంబర్‌తో పాటు కాల్ చేస్తున్న వ్యక్తి పేరు కూడా స్క్రీన్‌పై కనిపిస్తుంది. దీంతో వినియోగదారులు గుర్తు తెలియని కాల్స్‌ను సులభంగా గుర్తించడంతో పాటు, మోసపూరిత కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండేందుకు అవకాశం ఉంటుంది.ప్రస్తుతం ఫోన్‌కు కాల్ వచ్చినప్పుడు సాధారణంగా ఫోన్ నంబర్ మాత్రమే కనిపిస్తుంది. ఆ నంబర్‌ను మనం కాంటాక్ట్స్‌లో సేవ్ చేసుకుంటేనే మనం పెట్టుకున్న పేరు కనిపిస్తుంది. అయితే కొత్తగా అమలు చేయనున్న అజెంఖ విధానంలో టెలికాం ఆపరేటర్ల వద్ద నమోదైన చందాదారుల వివరాల ఆధారంగా కాల్ చేస్తున్న వ్యక్తి పేరు కూడా కనిపిస్తుంది.ఈ విధానాన్ని అమలు చేయాలని కేంద్ర టెలికమ్యూనికేషన్స్ విభాగం టెలికాం సేవల సంస్థలను ఆదేశించినట్లు సమాచారం. తొలుత 4ఉ, 5ఉ వంటి నెట్‌వర్క్‌లలో ఈ సేవను అందుబాటులోకి తీసుకురానున్నారు. 2ఉ, 3ఉ నెట్‌వర్క్‌లు, ల్యాండ్‌లైన్ కనెక్షన్లకు సంబంధించి అమలు విధానాన్ని ప్రత్యేకంగా పరిశీలించనున్నారు.అజెంఖ విధానంలో ఫోన్‌కు ఇన్‌కమింగ్ కాల్ వచ్చినప్పుడు నంబర్‌తో పాటు కాల్ చేస్తున్న వ్యక్తి పేరు కూడా స్క్రీన్‌పై కనిపిస్తుంది. ఈ ప్రక్రియలో కొన్ని అంశాలను తెలుసుకోవాలి.కాంటాక్ట్స్‌లో నంబర్ ఉంటే: ఫోన్‌లో ఇప్పటికే సేవ్ చేసుకున్న పేరు కనిపిస్తుంది.నంబర్ సేవ్ చేయకపోతే: టెలికాం ఆపరేటర్ వద్ద నమోదైన చందాదారుడి పేరు కనిపిస్తుంది.విదేశాల నుంచి వచ్చే కాల్స్: స్క్రీన్‌పై అని కనిపిస్తుంది.ఈ వ్యవస్థ సక్రమంగా పనిచేయడానికి ప్రతి టెలికాం సంస్థ తన వినియోగదారుల పేర్లు, ఫోన్ నంబర్లకు సంబంధించిన డేటాబేస్‌ను నిర్వహించాల్సి ఉంటుంది.

కాల్ అందుకునే వ్యక్తి ఉపయోగిస్తున్న టెలికాం సంస్థ అవసరమైన వివరాలను సంబంధిత డేటాబేస్ నుంచి సేకరించి స్క్రీన్‌పై ప్రదర్శిస్తుంది.కొత్త వ్యవస్థలో వినియోగదారుల వ్యక్తిగత సమాచార భద్రతకు కూడా ప్రాధాన్యం ఇచ్చినట్లు ఆదేశాల్లో పేర్కొన్నట్లు సమాచారం. కాల్ సమయంలో పేరు తెలుసుకునేందుకు ఉపయోగించే సమాచారాన్ని కాల్ ముగిసిన తర్వాత నిల్వ చేయకూడదనే నిబంధనను అమలు చేయనున్నారు. అలాగే, కాలింగ్ లైన్ ఐడెంటిఫికేషన్ రిస్ట్రిక్షన్ ) సేవను ఉపయోగిస్తూ తమ నంబర్ వివరాలను ఇతరులకు కనిపించకుండా చేసుకున్న చందాదారులకు ఈ వ్యవస్థ నుంచి మినహాయింపు ఉంటుంది. అలాంటి వినియోగదారుల పేర్లు ద్వారా ప్రదర్శించరు.వ్యాపార సంస్థలు, బల్క్ కనెక్షన్ల వినియోగదారులకు టెలికాం సంస్థల వద్ద నమోదైన పేరుకు బదులుగా వేరే వ్యాపార పేరును ప్రదర్శించుకునే అవకాశం కల్పించవచ్చు. అయితే, ఆ పేరుకు సంబంధించి రిజిస్టర్డ్ ట్రేడ్‌మార్క్ లేదా వస్తు సేవల పన్ను పోర్టల్‌లో నమోదైన వ్యాపార పేరు వంటి ఆధారాలు ఉండాలి. వ్యాపార సంస్థలు కోరుకున్న పేరును ప్రదర్శించే ముందు సంబంధిత టెలికాం ఆపరేటర్లు ఆ పేరును, దానికి సంబంధించిన పత్రాలను పరిశీలించాల్సి ఉంటుంది. ఇప్పటికే నమోదైన వ్యాపార పేరును మార్చుకోవాలనుకునే వారు తమ టెలికాం సేవల సంస్థకు అభ్యర్థన సమర్పించాలి.గుర్తు తెలియని నంబర్ల నుంచి వచ్చే కాల్స్‌ను గుర్తించడం, మోసపూరిత కాల్స్‌ను ఎదుర్కోవడంలో వినియోగదారులకు సహాయపడటం ఈ వ్యవస్థ ప్రధాన ఉద్దేశం. ఫోన్‌లో సేవ్ చేసుకున్న పేర్లపై ఆధారపడకుండా, టెలికాం సంస్థల వద్ద నమోదైన వివరాల ఆధారంగా కాలర్‌ను గుర్తించే అవకాశం కలుగుతుంది.ఈ విధానానికి సంబంధించి టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ 2024 ఫిబ్రవరిలో సిఫార్సులు చేసింది. 2025 అక్టోబర్‌లో సేవను వినియోగదారులకు డిఫాల్ట్‌గా అందుబాటులో ఉంచాలన్న ప్రతిపాదనకు

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ బరిలో కవిత పార్టీ




**హైదరాబాద్** తెలంగాణ రక్షణ సేన ప్రత్యక్ష ఎన్నికల సమరానికి తొలిసారిగా శంఖారావం పూరించింది. ఉమ్మడి వరంగల్ ఖమ్మం నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ అభ్యర్థిగా ఉద్యమకారుడు, విద్యావేత్త డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్‌ను పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత అధికారికంగా ప్రకటించారు. దసరా పర్వదినం శుభ ముహూర్తాన్ని పురస్కరించుకుని పార్టీ తరఫున ప్రత్యక్ష ఎన్నికల బరిలోకి దిగుతున్న మొట్టమొదటి అభ్యర్థిని ఖరారు చేస్తూ ఆమె నిర్ణయం తీసుకున్నారు. పార్టీ ఆవిర్భావం తర్వాత ఎదుర్కొంటున్న తొలి ఎన్నిక కావడంతో ఈ స్థానాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని, బలమైన విద్యా నేపథ్యం ఉన్న ఉద్యమ నేతను బరిలో నిలిపారు.ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని, గ్రౌండ్ లెవల్ సమన్వయాన్ని వేగవంతం చేసేందుకు పార్టీ సంస్థాగత యంత్రాంగాన్ని కూడా రంగంలోకి దించారు. ఈ ఎన్నికల ప్రక్రియను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు, సమన్వయం చేసేందుకు స్టేట్ పార్టీ అబ్జర్వర్, ఎన్నికల కో-ఆర్డినేటర్‌గా పార్టీ సీనియర్ నాయకుడు సయ్యద్ ఇస్మాయిల్‌ను కల్వకుంట్ల కవిత నియమించారు. పట్టభద్రుల సమస్యలు, నిరుద్యోగ యువత ఆకాంక్షలను ప్రధాన ఎజెండాగా తీసుకుని ఎన్నికల ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్లేలా పక్కా కార్యాచరణను రూపొందించాలని ఇస్మాయిల్‌కు బాధ్యతలు అప్పగించారు.అభ్యర్థిగా ఎంపికైన డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్ సుదీర్ఘమైన ఉద్యమ, విద్యా నేపథ్యం కలిగిన నాయకుడు. దసరా పండుగ శుభసందర్భంగా శ్రీకాంగ్ గౌడ్‌ను తమ పార్టీ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కవిత ప్రకటించారు. ఈ ఎమ్మెల్సీ స్థానంలో ఎన్నికల సమన్వయం, పర్యవేక్షణ కోసం స్టేట్ పార్టీ అబ్జర్వర్‌గా సయ్యద్ ఇస్మాయిల్‌ను నియమించినట్లు కవిత తెలిపారు. ఈ ప్రకటనతో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కవిత పార్టీ పోటీకి సిద్ధమైనట్లు స్పష్టం చేసింది. అభ్యర్థి ప్రకటనతో పట్టభద్రుల ఎన్నికల ప్రచారాన్ని మరింత వేగవంతం చేయాలని పార్టీ నిర్ణయించింది.ఉమ్మడి వరంగల్ జిల్లా నర్సింహులపేట మండలం కౌసల్యాదేవిపల్లికి చెందిన ఆయన కాకతీయ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పూర్తి చేశారు. మలిదశ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో విద్యార్థి దశ నుంచే చురుకైన పాత్ర పోషించారు. తెలంగాణ జాగృతి సంస్థ ప్రారంభమైన నాటి నుంచి కల్వకుంట్ల కవిత వెన్నంటి నడిచిన ఆయన.. పార్టీ అధికార ప్రతినిధిగా టీవీ చర్చల్లో, ప్రజా సంఘాల వేదికలపై సమర్థవంతంగా గళం వినిపిస్తూ ప్రజల్లో విశేష గుర్తింపు పొందారు.బహుజనుల గొంతుకగా నిలుస్తూ నిరంతరం ప్రజా ఉద్యమాలకు రూపకల్పన చేస్తున్న కల్వకుంట్ల కవిత.. అదే సంప్రదాయాన్ని తొలి ఎన్నికల అభ్యర్థి ఎంపికలోనూ కొనసాగించారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన ఉన్నత విద్యావంతుడికి ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా పార్టీ విధానాలను చేతల్లో చాటిచెప్పారు. తెలంగాణ రక్షణ సేన నేరుగా ఎన్నికల క్షేత్రంలోకి దిగడం, అందునా విద్యావంతులు, నిరుద్యోగులు నిర్ణయాత్మక శక్తిగా ఉన్న పట్టభద్రుల స్థానాన్ని ఎంచుకోవడంతో వరంగల్ ఖమ్మం నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పోరు ఆసక్తికరంగా మారిం

## రాజకీయ పార్టీలకు

# జెన్ జీ భయం

**హైదరాబాద్** తెలంగాణలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో జెన్-జీ భయం రాజకీయా పార్టీలకు పట్టుకుంది. ప్రధానంగా బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ లు జెన్ జీ లు ఎవరికి మద్దతుగా నిలుస్తారన్న దానిపై లెక్కలు వేసుకుంటున్నాయి. దేశ వ్యాప్తంగా జరుగుతున్న జెన్ జీ ఉద్యమం ఎవరిని ముంచుతుందన్న ఆందోళనలోరాజకీయ పార్టీలున్నాయి. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలంటే కొత్తగా చేరిన యువత ఓట్లు ఎక్కువగా ఉంటాయి. దేశంలో ఇటీవల జెన్ జీ ఉద్యమం తీవ్ర రూపం దాల్చడంతో మూడు ప్రధాన పార్టీలు భయాందోళనలో పడ్డాయి. యువత ఎవరి వైపు మొగ్గు చూపుతుందన్నది ఈ ఎన్నికల్లో తేలిపోతుందన్నది ఆసక్తికరంగా మారింది. అనేక అంశాలు గెలుపోటములపై ప్రభావం చూపుతాయి. అందుకే రాజకీయ పార్టీలకు జెన్ జీ భయం పట్టుకుంది.. నిరుద్యోగ సమస్యలు ప్రధాన ప్రభావం చూపుతుండటంతో ప్రధాన రాజకీయ పార్టీల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో దాదాపు మూడు లక్షలకు పైగా కొత్త ఓటర్లు చేరే అవకాశం ఉండటంతో, వీరి మద్దతు ఎటు వైపు ఉంటుందనేది పార్టీల్లో ఉత్కంఠను రేపుతోంది. కొన్ని సర్వేల ప్రకారం... గ్రాడ్యుయేట్ ఓటర్లలో 31 శాతం మంది నిరుద్యోగాన్ని ప్రధాన సమస్యగా పేర్కొన్నారు. జాబ్ నోటిఫికేషన్లు, ఉద్యోగాల భర్తీలో జాప్యం 24 శాతం వంటి అంశాలు కలిపి మొత్తం యాభై ఐదు శాతం వరకు ఉపాధి అంశాల చుట్టూనే చర్చ నడుస్తోంది. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. పాలనపై ప్రజల, ముఖ్యంగా యువత అభిప్రాయానికి ఈ ఫలితాలను కొలమానంగా భావిస్తున్నారు. మూడు పార్టీల అభ్యర్థులు... కాంగ్రెస్ వేగంగా అభ్యర్థుల ఎంపిక మరియు ఓటర్ల నమోదుపై దృష్టి పెట్టగా, బీజేపీ మరియు బీఆర్ఎస్ పార్టీలు కూడా ప్రత్యేక వ్యూహాలతో యువతను ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి. యువతలో ఉన్న అసంతృప్తిని ఎలా అధిగమించాలనేదానిపై పార్టీలు మథనపడుతున్నాయి. మరొకవైపు బీజేపీకి కూడా జెన్ జీ భయం పట్టుకుంది. దేశ వ్యాప్తంగా ఎన్నికల కమిషన్ వివిధ అంశాలపై ఆందోళనలు జరుగుతున్న నేపథ్యంలో బీజేపీకి యువత హ్యాండ్ ఇస్తారన్న భయంలో బీజేపీ ఉంది. దేశ వ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలు బీజేపీకి భయాన్ని కలిగిస్తున్నాయి. బీఆర్ఎస్ కూడా ఇదే పరిస్థితుల్లో ఉంది. బీఆర్ఎస్ యువతను ఆకట్టుకునేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేసింది. గత పదేళ్ల పాలన ప్రభావం ఈ ఎన్నికల్లో చూపుతుందేమోనని కొంత బెరుకు కనపడుతుంది. మొత్తం మీద గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో జెన్ జీ భయం అన్ని రాజకీయ పార్టీలకు వణుకు పుట్టిస్తోంది.**రేవంత్ సర్కార్‌కు అసలు సిసలు అగ్నిపరీక్ష!** . అధికార కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాలనపై ప్రజలు, ముఖ్యంగా విద్యావంతులైన పట్టభద్రుల నాడి ఎలా ఉందో అంచనా వేయడానికి ఈ ఎన్నికలు ఒక లిట్మస్ టెస్ట్ లా మారాయి. రాష్ట్రంలోని మొత్తం 119 అసెంబ్లీ స్థానాలలో దాదాపు మూడింట రెండొంతులు అంటే 77 అసెంబ్లీ నియోజకవర్గాలను కవర్ చేసే ఈ రెండు పట్టభద్రుల నియోజకవర్గాల పోరు రసవత్తరంగా మారుతోంది.కార్మికులు, నిరుద్యోగులు, ప్రజా సమస్యలపై ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని ఇరుకున పెడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఈ ఎన్నికల్లో విజయం సాధించి రేవంత్ రెడ్డి ప్రభుత్వం తన పాలనకు ప్రజల నుంచి పూర్తి మద్దతు ఉందని నిరూపించుకోవాలనుకుంటోంది. ఒకవేళ ఫలితాలు వ్యతిరేకంగా వస్తే, అది కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా ఇబ్బందికరంగా మారుతుంది. అంతేకాకుండా బీఆర్ఎస్, బీజేపీలు దీనిని ప్రభుత్వ వ్యతిరేకతగా ప్రచారం చేసే అవకాశం ఉంది. అందుకే కాంగ్రెస్ నాయకత్వం దీన్ని కేవలం సాధారణ ఎన్నికగా చూడకుండా.. రాజకీయ మనుగడకు, పట్టు నిలుపుకోవడానికి అత్యంత కీలకమైన పోరుగా భావిస్తోంది.ఈ ఎన్నికల్లో ముందుగా అభ్యర్థులను ప్రకటించి కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా ఒక అడుగు ముందుకేసింది. మహబూబ్ నగర్- రంగారెడ్డి- హైదరాబాద్ స్థానం నుంచి సామ రామమోహన్ రెడ్డిని, వరంగల్- నల్గొండ- ఖమ్మం స్థానం నుంచి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని బరిలోకి దింపింది. సీఎం రేవంత్ రెడ్డికి స్వస్థలమైన ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఈ నియోజకవర్గ పరిధిలో ఉండటంతో ఆయన దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ రెండు స్థానాల్లో గెలుపు కాంగ్రెస్ స్థానాన్ని మరింత పటిష్టం చేస్తుందని పరిశీలకులు భావిస్తున్నారు.మరోవైపు.. ఈ ఎన్నికలు కేవలం అభ్యర్థుల సామర్థ్యంపైనా ఆధారపడవు. ఆయా నియోజకవర్గాల కాంగ్రెస్ ఎమ్మెల్యేల సంస్థాగత బలానికి కూడా పెద్ద పరీక్షగా మారాయి. గతంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలలో ధన ప్రభావం గణనీయంగా ఉండేది. అధికార పార్టీ ఈసారి ప్రచారంలో ఏ చిన్న అవకాశాన్ని కూడా వదిలిపెట్టాలని భావించడం లేదు. ఓటర్ల నమోదు ప్రక్రియను విజయవంతం చేయడానికి ఆన్‌లైన్ సదుపాయాలతో పాటు, నేరుగా ఓటర్లను సంప్రదించే వ్యూహాలకు పదును పెట్టారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, దామోదర రాజనర్సింహ తదితరులు వివిధ జిల్లాల్లో పార్టీ శ్రేణులతో వరుస సమావేశాలు నిర్వహిస్తూ సమన్వయం చేస్తున్నారు. అక్టోబర్ 23న పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులతో సమీక్షా సమావేశం నిర్వహించి తుది ప్రచార వ్యూహాన్ని ఖరారు చేయనున్నారు.ఇదిలా ఉంటే? బీఆర్ఎస్ కూడా ఈ ఎన్నికలను సీరియస్‌గా తీసుకుంది. ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంబంధిత జిల్లాల నేతలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తూ పార్టీ శ్రేణులను సమాయత్తం చేస్తున్నారు. గతంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలను కైవసం చేసుకున్న జోష్‌లో ఉన్న బీజేపీ కూడా తన పట్టును మరింత నిలుపుకోవాలని చూస్తోంది. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ సౌలభ్యం ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఓటర్ల భాగస్వామ్యం ఆశించిన స్థాయిలో

# "రైతు అనగానే కేవలం కష్టాలు, కన్నీళ్లు మాత్రమే కాదు

## ప్రకృతికి ప్రాణం పోసే ఒక సృష్టికర్త" అనే భావన ప్రతి ఒక్కరిలో కలగాలి

**రంగప్రసాద్ జీవితం, ఆయన నడుపుతున్న 'ఐ ఫార్మ్స్' , విజయరామ్ స్ఫూర్తి, పాలేకర్ పద్ధతులు, నా స్వీయ అనుభవం.. ఇవన్నీ కలబోసి, నేలతల్లికి ఆయన చేస్తున్న సేవను కీర్తిస్తూ, ఒక అద్భుతమైన, ప్రేరణాత్మక వ్యాసాన్ని అందిస్తున్నాను.**

**నేలతల్లి పులకరించిన వేళ... సేద్యం ఓ సజీవ కావ్యమైన వేళ**

**(ఆదర్శ అభ్యుదయ రైతు రంగప్రసాద్ కి అక్షర నీరాజనం)**





మట్టిని ముట్టుకుంటే చేతులు మాసిపోతాయని భయపడే ఈ ఆధునిక కాలంలో.. ఆ మట్టిలోనే ప్రాణాన్ని, పరమాత్మను చూశాడు ఒక ప్రకృతి ప్రేమికుడు. లక్షల జీతాలు తెచ్చిపెట్టే ఏసీ గదుల్లోని ఉద్యోగాన్ని వదిలి, ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ.. నేలతల్లికి పచ్చని చీర కట్టాలని కంకణం కట్టుకున్న ఆ సృష్టికర్త పేరే రంగప్రసాద్, వ్యవసాయం అంటే దైన్యంగా చూసే ఈ సమాజంలో, సేద్యాన్ని ఒక యజ్ఞంలా, ఒక తపస్సులా ఆచరిస్తూ నేటి యువతకు వ్యవసాయంపై సరికొత్త గౌరవాన్ని, ఆరాధనా భావాన్ని కల్పిస్తున్న అభ్యుదయ రైతు ఆయన.ఉన్నత చదువులు చదివి, బ్యాంక్ మేనేజర్ గా ఒక వెలుగు వెలిగిన రంగప్రసాద్ .. సమాజం ఆరోగ్యం ఏమైపోతున్నా పర్వాలేదు, లాభాలు వస్తే చాలు అనుకునే వ్యాపార దృక్పథానికి దూరంగా నడిచారు. రసాయనాలు, విషతుల్యమైన మందులతో నేలతల్లి ప్రాణాలు తోడేస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఆయన గుండె ద్రవించింది. అమృతాన్ని పండించాల్సిన నేలమ్మ ఒడిలో విషం పోయడానికి ఆయన మనసు అంగీకరించలేదు. వెంటనే తన కెరీర్ ను పక్కనపెట్టి 'ఐ ఫార్మ్స్' పేరిట ఏకంగా 70 ఎకరాల విస్తీర్ణంలో ఒక మహా ప్రకృతి యజ్ఞానికి శ్రీకారం చుట్టారు.ప్రకృతి వ్యవసాయ పితామహుడు సుభాష్ పాలేకర్ పద్ధతులను అధ్యయనం చేస్తూ, ఆదర్శ రైతు విజయరామ్ అడుగుజాడల్లో నడుస్తూ.. తనకంటూ సొంతంగా కొన్ని ప్రకృతి అనుకూల సేద్య విధానాలను ఆవిష్కరించారు. బయటి నుంచి ఒక్క రసాయనపు బస్తా కూడా తన పొలంలోకి అడుగుపెట్టకుండా, ఆవు పేడ, గోమూత్రం, చెట్ల ఆకులతోనే మట్టికి ప్రాణం పోస్తున్నారు.రంగప్రసాద్ తోట కేవలం కూరగాయలు పండే పొలం కాదు, అదొక ప్రాణవాయువును పంచే ఆశ్రమం. ఆ క్షేత్రంలో అడుగుపెడితే ఏదో పుణ్యక్షేత్రంలో అడుగుపెట్టినంత ప్రశాంతత కలుగుతుంది. ఆయన తోటలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'నక్షత్ర వనం' చూస్తే ప్రకృతిపై ఆయనకున్న ఆధ్యాత్మిక భావన అర్థమవుతుంది. కేవలం ఆహార పంటలే కాకుండా, మనిషి ప్రాణాలను నిలబెట్టే అత్యంత అరుదైన ఔషధ మొక్కలకు కూడా ఆయన తోటలో చోటు కల్పించడం విశేషం. కిడ్నీలో రాళ్లను ఇట్టే కరిగించగల అద్భుత ఔషధి 'కొండపిండి' ఆకుకూర మొదలుకొని, మేధస్సును వికసింపజేసే 'సరస్వతి ఆకు' వరకు ఎన్నో అమూల్యమైన మూలికలను ఆ నేలమ్మ అక్కున చేర్చుకుని పెంచుతున్నారు. ఎక్కడ దొరుకుతుందో తెలియక ఇబ్బంది పడే ఎంతోమందికి, ఆ ఔషధ మొక్కలను అందిస్తూ పరోక్షంగా వైద్య నారాయణుడిగా మారుతున్నారు. వ్యవసాయాన్ని ఒక ఫ్యాషన్ గా, ఒక పవిత్రమైన బాధ్యతగా స్వీకరించిన రంగప్రసాద్ ఎంతో మంది స్థానికులకు ఉపాధి కల్పిస్తున్నారు. ఆయన క్షేత్రంలో ప్రతి చెట్టూ పలకరిస్తుంది, ప్రతి ఆకూ నవ్వుతుంది. జీవవైవిధ్యానికి దర్పణంగా నిలుస్తున్న ఆయన క్షేత్రం పక్షులకు, మిత్ర కీటకాలకు, దేశవాళీ ఆవులకు ఒక సురక్షితమైన ఆవాసం. తన కోసం తాను బతికే ఈ స్వార్థ ప్రపంచంలో.. రాబోయే తరాలకు విషం లేని ఆహారాన్ని, సారం పోని మట్టిని, కాలుష్యం లేని గాలిని అందించాలని అహర్నిశలు శ్రమిస్తున్న రంగప్రసాద్ లాంటి వ్యక్తులు ఈ భూమికి దొరికిన అపురూపమైన వరాలు. ఒక రైతు తలుచుకుంటే నేల బతుకుతుంది, పర్యావరణం బతుకుతుంది, రేపటి తరాల ఆయుష్షు పెరుగుతుంది అని చేతల్లో చేసి చూపిస్తున్న రంగప్రసాద్ కి ఆయుర్వేద పరంపర మూలికా వైద్య మహా సంఘం తరఫున శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. అక్షరాలా ఆయన వ్యవసాయం ఒక సజీవ కావ్యం. ఆయన శ్రమకు, తపనకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలి. ఈ హరిత యోధుడు చూపిస్తున్న మార్గంలో వందలాది మంది యువకులు వ్యవసాయం వైపు గర్వంగా అడుగులు వేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ..

వ్యాస రచయిత ,
డా. సింహాచలం లక్ష్మణస్వామి
పరంపర వైద్యులు, వ్యవస్థాపక అధ్యక్షులు
(ఆయుర్వేద పరంపర మూలికా వైద్య మహా సంఘం)
కవి - రచయిత.
9000187858

## నామినేషన్ కేంద్రాలలో ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలి



**రాయచోటి :** అన్నమయ్య జిల్లాలోని మదనపల్లెలోని జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన జెడ్పీటీసీ నామినేషన్ కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ బుధవారం పరిశీలించారు.ఈ సందర్భంగా నామినేషన్ల స్వీకరణకు అవసరమైన ఏర్పాట్లను సమీక్షించి, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, హెల్ప్‌డెస్క్ సిబ్బందికి స్పష్టమైన విధులు కేటాయించాలని, రద్దీ నియంత్రణకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం నామినేషన్ల ప్రక్రియను పారదర్శకంగా, సజావుగా నిర్వహించాలని, పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ లక్ష్మీపతి, మదనపల్లె తహసీల్దార్ మాధవి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు

## మదనపల్లి, రాయచోటిలలో పోలీసుల ర్యాలీ

**రాయచోటి** అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఎస్పీ ధీరజ్ కనుమిలి ఆధ్వర్యంలో మదనపల్లి రాయచోటి లలో పోలీసులు ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా ఎస్పీ ధీరజ్ మాట్లాడుతూసమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణకు అహర్నిశలు కృషి చేస్తూ, విధి నిర్వహణలో తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలు చిరస్మరణీయమని అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మదనపల్లెలోని బీటీ కళాశాల పోలీసు పరేడ్ మైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొని అమర వీరులకు ఘనంగా నివాళులర్పించారు. దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన 154 మంది పోలీసులతో పాటు, జిల్లాలో వివిధ కారణాలతో మృతి చెందిన తొమ్మిది మంది పోలీసులను స్మరించుకున్నారు.త్యాగాలకు ప్రతీక.. అక్టోబర్ 21ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ.. 1959 అక్టోబర్ 21న లడఖ్‌లో చైనా సైనికుల దాడిలో పది మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు వీరమరణం పొందిన ఘటనకు గుర్తుగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశ రక్షణతో పాటు ప్రజల భద్రత కోసం నిరంతరం సవాళ్లను ఎదుర్కొంటూ, నిస్వార్థంగా సేవలందిస్తున్న పోలీసుల త్యాగాలు సమాజానికి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమన్నారు.ప్రజలు ప్రశాంతంగా జీవించేందుకు, సమాజంలో శాంతిభద్రతలు నెలకొల్పేందుకు పోలీసులు నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని పోలీసు సిబ్బందికి సూచించారు.

అన్నమయ్య జిల్లా పోలీసులు నిబద్ధతతో విధులు నిర్వహిస్తున్నారని, ఇదే స్ఫూర్తితో ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ధైర్యం, అంకితభావం పోలీసుల విధి నిర్వహణకు బలం×జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మాట్లాడుతూ.. "ధైర్యం అంటే భయం లేకపోవడం కాదు.. భయం ఉన్నప్పటికీ బాధ్యతతో ముందడుగు వేయడం" అని పేర్కొన్నారు. దేశ రక్షణలో, ప్రజల భద్రతలో అమరులైన పోలీసుల ధైర్యసాహసాలు, అంకితభావం ప్రతి ఒక్కరికీ ఆదర్శమన్నారు. ఉగ్రవాదులు, నక్సలైట్లు, నేరస్థులతో పోరాడుతూ అనేకమంది పోలీసులు తమ ప్రాణాలను త్యాగం చేశారని గుర్తుచేశారు.కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లోనూ పోలీసులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజల రక్షణ కోసం విధులు నిర్వహించారని తెలిపారు. విధి నిర్వహణలో అమరులైన పోలీసుల కుటుంబాలు చేసిన త్యాగాలను సమాజం ఎప్పటికీ గుర్తుంచుకోవాలని అన్నారు. అమరుల కుటుంబాలకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారికి ఏ అవసరం వచ్చినా సహాయం అందించేందుకు సిద్ధంగా ఉంటామని భరోసా ఇచ్చారు.అమరులకు ఘన నివాళులు.. పోలీసు అమరవీరుల స్మారక ర్యాలీ.కార్యక్రమంలో భాగంగా అదనపు ఎస్పీ (పరిపాలన) ఎం. వెంకటాద్రి దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో అమరులైన 154 మంది పోలీసుల పేర్లను చదివి వినిపించారు. అనంతరం అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ పోలీసు పరేడ్ మైదానం నుంచి అనిబిసెంట్ సర్కిల్ వరకు స్మారక ర్యాలీ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, ఎస్పీ ధీరజ్ కునుబిల్లి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.ఈ ర్యాలీలో సాయుధ పోలీసు బలగాలు, పోలీసు అధికారులు, సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు, స్థానిక ప్రజలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొని అమరవీరులకు నివాళు లర్పించారు. పోలీసుల త్యాగాలను స్మరించుకుంటూ, ప్రజల భద్రత పట్ల వారి అంకితభావాన్ని చాటిచెప్పారు.అమరుల కుటుంబాలకు అండగా పోలీసు శాఖకార్యక్రమం ముగింపులో జిల్లాలో మృతి చెందిన పోలీసుల కుటుంబ సభ్యులకు అధికారులు నగదు బహుమతులు అందజేశారు. వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అమరుల కుటుంబాల సంక్షేమానికి పోలీసు శాఖ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, అదనపు ఎస్పీ (పరిపాలన) ఎం. వెంకటాద్రి, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు యు. రంగనాథ్ బాబు, కె. సురేష్ కుమార్ రెడ్డి, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, అమరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఉదయాన్నే ఈ తెల్లటి రసం తాగి చూడండి..

ప్రతి రోజు ఉదయం ఒక గ్లాసు తెల్ల గుమ్మడికాయ రసం తాగడం ఆరోగ్యానికి చాలా మంచిది. చాలా మంది ఉదయాన్నే కాఫీ, టీ తాగుతారు. వాటికి బదులు ఈ సహజ రసం తీసుకుంటే శరీరానికి మేలు చేస్తుంది. మనసుకు ప్రశాంతతను ఇస్తుంది. తెల్ల గుమ్మడికాయలో చాలా పోషకాలు ఉంటాయి. ఇవి నరాలకు శక్తిని ఇస్తాయి. మెదడును ప్రశాంతంగా ఉంచడంలో సహాయపడుతాయి. దాంతో ఉదయాన్నే ఈ రసం తాగితే ఒత్తిడి తగ్గుతుంది. ఆందోళన లేకుండా రోజంతా ఉత్సాహంగా ఉంటారు. ఈ రసం మూత్రపిండాలకు ఎంతో మేలు చేస్తుంది. మూత్రంలో వచ్చే ఇన్ ఫెక్షన్లు, మూత్రంలో రక్తం రావడం, పైల్స్ వల్ల రక్తం పోవడం లాంటి సమస్యలను తగ్గిస్తుంది. తెల్ల గుమ్మడికాయ రసం చల్లగా ఉంటుంది. శరీరాన్ని ప్రశాంతంగా ఉంచుతుంది.అల్సర్ తో బాధపడేవారు తెల్ల గుమ్మడికాయ రసాన్ని తేనెతో కలిపి ఉదయం తాగితే కడుపు లోపల గాయాలు త్వరగా తగ్గుతాయి. కడుపులోని పురుగులను బయటకు పంపిస్తుంది. కొత్త ఇన్ ఫెక్షన్లు రాకుండా ఆపుతుంది.బరువు తగ్గాలని అనుకునే వారికి ఇది బాగా ఉపయోగపడుతుంది. రోజూ ఉదయం ఈ రసం తాగడం వల్ల శరీరంలోని అదనపు నీరు బయటకు పోతుంది. ఇది బరువు తగ్గించడమే కాకుండా.. శరీరాన్ని తేలికగా, శక్తివంతంగా ఉంచుతుంది. శరీరంలో వేడి ఎక్కువగా ఉన్నవారికి కూడా ఇది చాలా మంచిది.

ఈ రసం తాగితే శరీరం చల్లబడుతుంది. తేమగా మారుతుంది. వేసవిలో వేడి సమస్యలతో బాధపడే వారికి ఇది మంచి పరిష్కారం.తెల్ల గుమ్మడికాయ రసాన్ని తేనెతో కలిపి ఉదయం, సాయంత్రం తాగితే రక్తం శుభ్రపడుతుంది. ఇది శరీరం లోపల అవయవాలకు సాయపడుతుంది. రక్తం కారడాన్ని నియంత్రించడంలో కూడా తోడ్పడుతుంది. ఈ గుమ్మడికాయలో విటమిన్ బి, సి, కాల్షియం, పొటాషియం, ఫాస్ఫరస్, ఫైబర్, ఐరన్, నీరు ఎక్కువగా ఉంటాయి. ఇవన్నీ ఆరోగ్యానికి అవసరమైన ముఖ్యమైన పదార్థాలు. ప్రతి ఉదయం ఒక గ్లాసు తెల్ల గుమ్మడికాయ జ్యూస్ తాగడం మన శరీరానికి, మనసుకు చాలా మంచిది. ఇది ఒక చిన్న అలవాటు. కానీ దీని వల్ల చాలా గొప్ప ఫలితాలు ఉంటాయి.

## దసరా వేడుకల్లో ఆత్మీయులతో స్పీకర్ సొంత నియోజకవర్గంలో నిర్వహించిన దసరా వేడుకల్లో తెలంగాణ శాసన సభాపతి,

**వికారాబాద్ జిల్లా** వికారాబాద్ శాసనసభ్యులు శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ పాల్గొనడంతో పండుగ వాతావరణం మరింత ఉత్సాహభరితంగా మారింది. అడుగడుగునా ఆత్మీయ స్వాగతాలు, అభిమాన పలకరింపులతో వికారాబాద్ పట్టణం పండుగ శోభను సంతరించుకుంది. ఆప్యాయతను పంచుకుం టూ, ఆత్మీయతను చాటుకుంటూ సాగిన ఈ వేడుకలు దసరా సంప్రదాయాల గొప్పతనాన్ని మరోసారి చాటి చెప్పాయి. దసరా సందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ తన సొంత నియోజకవర్గంలోని ప్రజల మధ్య ఆత్మీయంగా గడుపుతూ, పెద్దలు, చిన్నారులను ఆప్యాయంగా పలకరిస్తూ, సరదాగా ముచ్చటిస్తూ పండుగ ఆనందాన్ని అందరితో పంచుకున్నారు. వికారాబాద్ ప్రజా భవన్ (ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం)లోనూ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మర్యాదపూర్వకంగా కలిసి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా అమరవీరుల దినోత్సవం

**వికారాబాద్ జిల్లా** వికారాబాద్ పట్టణ కేంద్రం లోని జిల్లా పోలీస్ పరెడ్ గ్రౌండ్ లో ఘనంగా అమరవీరుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా ఎస్పీ స్నేహ మెహర పాల్గొని ముందుగా గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశం కోసం, ప్రజల రక్షణ కోసంతమ ప్రాణాలను సైతం త్యాగం చేసినవీర పోలీస్ అమరవీరులకు హృదయపూర్వక నివాళులు అర్పించారు.వారి త్యాగం చిరస్మరణీయం అని కొనియాడారు. వారి సేవలు స్ఫూర్తిదాయకనీ అన్నారు.పోలీసులు విధినిర్వహణలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజల కోసం 24 గంటలు తమ కుటుంబాలు సైతం లెక్క చేయకుండా పనిచేయడమే పోలీస్ యొక్క కర్తవ్యనీ అని తెలిపారు.

## పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

**- కలెక్టర్ చిత్రా మిశ్రా, సీపీ గౌష్ ఆలం**



**కరీంనగర్** కరీంనగర్ ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, పేర్కొన్నారు.పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా బుధవారం కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లోని అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అడిషనల్ డీసీపీ వెంకటరమణ విధి నిర్వహణలో దేశవ్యాప్తంగా ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల నామావళిని చదివి వినిపించి గౌరవ వందనం సమర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ. దేశవ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. జిల్లా యంత్రాంగానికి పోలీస్ శాఖ వెన్నెముక వంటిదని, శాంతిభద్రతలు పటిష్టంగా ఉన్నప్పుడే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలవుతాయని పేర్కొన్నారు. అమరవీరుల కుటుంబాలకు, వారి పిల్లల విద్యాభివృద్ధి, సంక్షేమానికి జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ. దేశ సమగ్రత, అంతర్గత భద్రత, ప్రజల రక్షణ కోసం పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. అమరవీరుల త్యాగాలు ప్రతి పోలీస్ అధికారి, సిబ్బందికి స్ఫూర్తిదాయకమని, వారి ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు అంకితభావంతో సేవలందించడమే వారికి అందించే నిజమైన నివాళి అని అన్నారు. అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటాయని పేర్కొన్నారు.పోలీసు అమరవీరుల కుటుంబాల సమస్యలు అడిగి తెలుసుకున్నారు, ప్రభుత్వం వారికి అందాల్సిన నష్టపరిహారాలను పూర్తి స్థాయిలో అందేలా చూస్తామన్నారు.పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా అక్టోబర్ 21 నుంచి 31 వరకు కమిషనరేట్ పరిధిలో రక్తదాన శిబిరాలు, ఓపెన్ హౌస్ కార్యక్రమాలు, వ్యాసరచన, లఘు చిత్రాల పోటీలు, విద్యార్థులు, యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ వెంకటరమణ, ఏసీపీలు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొని పోలీస్ అమరవీరులకు ఘన నివాళు లర్పించారు.

## ఘనంగా పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం

**- సిద్ధిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్**



**సిద్ధిపేట** పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం పోలీస్ ఫ్లాగ్ డే పురస్కరించుకొని సిద్ధిపేట పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. దేశ రక్షణ కోసం, ప్రజల ప్రాణాస్తుల రక్షణకై విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరులకు సిద్ధిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్,అదనపు డీసీపీలు, ఇతర అధికారులు మరియు అమరవీరుల కుటుంబ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా సిపి రష్మి పెరుమాళ్, మాట్లాడుతూ. పోలీస్ శాఖ అనేది ప్రతిరోజూ 24 గంటలూ పనిచేసే విభాగామని, పండుగలు, సెలవులు అనే తేడా లేకుండా సిబ్బంది నిరంతరం ఆన్ డ్యూటీలో ఉంటూ ప్రజల రక్షణ కోసం శ్రమిస్తున్నారని కొనియాడారు. 1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ వద్ద చైనా సైన్యం పొంచి దాడి చేసిన ఘటనలో వీరమరణం పొందిన పోలీస్ సిబ్బంది అత్యున్నత త్యాగాలను స్మరించుకుంటూ, నాటి నుంచి ప్రతి ఏటా అక్టోబర్ 21ని 'పోలీస్ కొమెమరేషన్ డే' అమరవీరుల సంస్మరణ దినోత్సవం గా జరుపుకుంటున్నామని తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరుల కుటుంబాలు ఎదుర్కొంటున్న కష్టాలను, వారి త్యాగాలను డిపార్ట్‌మెంట్ ఎప్పటికీ మరచిపోదని స్పష్టం చేశారు. పోలీస్ కుటుంబాలకు ఎలాంటి సమస్యలు వచ్చినా నేరుగా సంప్రదించవచ్చని, సిద్ధిపేట సిపిగా తాను మరియు పోలీస్ డిపార్ట్మెంట్ ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగానే కాకుండా దేశమంతటా పోలీస్ ఉన్నతాధికారులు అమరవీరుల కుటుంబాలకు ఇదే ప్రామిస్ చేస్తున్నారని, ఇంతటి అత్యున్నత త్యాగం చేసినా వారి కుటుంబ సంక్షేమానికి పోలీస్ డిపార్ట్మెంట్ కట్టుబడి ఉంటుందని తెలిపారు.కార్యక్రమానికి హాజరైన అమరవీరుల కుటుంబ సభ్యులతో సిపి ప్రత్యేకంగా మాట్లాడి వారి కుటుంబ పరిస్థితులను మరియు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారు విన్నవించిన సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇస్తూ, అమరవీరుల కుటుంబ సభ్యులను గౌరవించి జ్ఞాపికలను అందజేశారు.అదనపు డీసీపీ అడ్మిన్ కుశాల్కర్ మాట్లాడుతూ. సిద్ధిపేట కమిషనరేట్ పరిధిలో విధి నిర్వహణలో ఇప్పటివరకు 7 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది అమరులయ్యారని తెలిపారు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన 154 మంది అమరులైన పోలీస్ అధికారుల మరియు సిబ్బంది పేర్లను చదివి వినిపించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం అమరులైన పోలీసుల త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని, వారి సేవా స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ అడ్మిన్ కుశాల్కర్, అదనపు డీసీపీ ఏఆర్ సుభాష్ చంద్రబోస్, ఏసీపీలు, ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు మరియు పోలీస్ సిబ్బంది విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

# రౌడీయిజం చేస్తే రప్పా రప్పా

## రాజకీయ ముసుగులో నేరాలు చేస్తే ఉపేక్షించేది లేదు
## నేరగాళ్లకు ఖాకీ అంటే భయం.. బాధితులకు పోలీసులంటే భరోసా కావాలి
## అమర వీరుల త్యాగాలకు నిజమైన నివాళి ప్రజలకు భద్రత కల్పించడమే: సీఎం చంద్రబాబు



మంగళగిరి(ప్రశ్న న్యూస్) రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడేవారిని ఉపేక్షించేది లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాజకీయాలు నేరస్థులకు రక్షణ కల్పించే కవచాలుగా మారకూడదని తేల్చిచెప్పారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేసే రౌడీలు, సామాజిక మాధ్యమాల వేదికగా వేధింపులకు పాల్పడేవారిపై కఠినంగా వ్యవహరించాలని పోలీసు శాఖకు దిశానిర్దేశం చేశారు. నేరగాళ్లకు పోలీసు యూనిఫాం చూస్తే భయం కలగాలని.. బాధితులకు పోలీసులంటే భరోసా ఏర్పడాలని ఆకాంక్షించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ దేశానికే ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. మంగళగిరిలోని ఏపీఎస్పీ ఆరో బెటాలియన్‌లో బుధవారం నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో సీఎం పాల్గొని, విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పోలీసు అధికారులను, సిబ్బందిని ఉద్దేశించి ప్రసంగించారు.

### రాజకీయ ముసుగులో నేరాలకు చెక్..

రాజకీయ పలుకుబడిని అడ్డుపెట్టుకుని నేరాలకు పాల్పడేవారిపై కఠినంగా వ్యవహరించాలని చంద్రబాబు పోలీసులకు సూచించారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ రౌడీయిజానికి పాల్పడేవారిని ఉపేక్షించకూడదన్నారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకునే విషయంలో ఎలాంటి అలసత్వానికి తావివ్వకూడదని స్పష్టం చేశారు. సామాజిక మాధ్యమాల్లో వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని వేధింపులకు పాల్పడుతున్న వారిపైనా నిఘా పెంచాలని సూచించారు. ప్రజల స్వేచ్ఛకు, భద్రతకు విఘాతం కలిగించే చర్యలను అడ్డుకోవాలని పేర్కొన్నారు. చట్టం ముందు అందరూ సమానమేనని, నేరస్థులకు రాజకీయ అండదండలు రక్షణగా మారకూడదనే సందేశాన్ని సీఎం తన ప్రసంగంలో స్పష్టం చేశారు.

### శాంతిభద్రతలతోనే అభివృద్ధి..

రాష్ట్రంలో శాంతిభద్రతలు పటిష్ఠంగా ఉంటేనే పెట్టుబడులు వస్తాయని, పరిశ్రమలు ఏర్పాటవుతాయని చంద్రబాబు పేర్కొన్నారు. తద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వివరించారు. శాంతిభద్రతలు, అభివృద్ధి, ప్రజల సుఖసంతోషాలు పరస్పరం ముడిపడి ఉన్నాయని చెప్పారు. గతంలో ఫ్యాక్షనిజాన్ని నియంత్రించడంలో, నక్సలిజాన్ని ఎదుర్కోవడంలో, మత కలహాలను అరికట్టడంలో ఏపీ పోలీసులు ధైర్యసాహసాలు ప్రదర్శించారని గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖకు ప్రత్యేక గుర్తింపు ఉందని పేర్కొన్నారు. ఆ ప్రతిష్ఠను మరింత పెంచేలా పోలీసులు విధులు నిర్వర్తించాలని ఆకాంక్షించారు. ఇటీవల ఏపీ కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగం దేశ భద్రతకు భంగం కలిగించే కుట్రలను ఛేదించడంపై పోలీసు శాఖను అభినందించారు. నేరాలను గుర్తించి ఛేదించడం ఎంత ముఖ్యమో, అవి జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం కూడా అంతే ముఖ్యమని చెప్పారు.

## విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) అమరవీరుల స్థూపం వద్ద పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం నిర్వహించి, నివాళులర్పించిన జిల్లా ఎస్పీ. పోలీస్ అమరుల త్యాగాన్ని స్మరిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ఎస్పీ మహేష్ బి.గితే పరామర్శ. శాంతి భద్రతల పరిరక్షణకై విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు అందరికీ స్ఫూర్తిదాయకమని జిల్లా ఎస్పీ మహేష్ బి గితె అన్నారు. జిల్లాలోని చందుర్తి మండలం లింగంపేట గ్రామ శివారులో ఉన్న పోలీస్ అమరవీరుల స్తూపం వద్ద పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం (ఫ్లాగ్ డే) నిర్వహించి, అమరవీరుల కుటుంబ సభ్యులు, పోలీస్ అధికారులతో కలిసి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం సాయుధ పోలీసులు"శోక్ శస్త్" నిర్వహించి, మరణించిన పోలీసు అమరవీరులకు పోలీసు అధికారులు, సిబ్బంది అమరవీరుల కుటుంబ సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించి గత ఏడాది నుండి ఇప్పటి వరకు దేశంలో విధి నిర్వహణలో మరణించిన 154 మంది పోలీస్ అమరవీరుల పేర్లను చదివి వినిపించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకై సవాళ్లను ధీటుగా ఎదురించి, ప్రాణాలను సైతం త్యాగం చేసి, విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణకై ప్రాణత్యాగాలు చేసిన పోలీస్ అమరవీరులు ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచిపోతారని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులు, డిఎస్పీ లు నాగేంద్రచారి, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, సి.ఐ లు, ఆర్.ఐ లు,ఎస్.ఐ లు, ఆర్.ఎస్.ఐ లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వెంకటే రెడ్డి నగర్ డివిజన్ తెలంగాణ రక్షణ సేన అధ్యక్షుడిగా రంగు శేఖర్ గౌడ్ నియామకం

### పార్టీ బలోపేతానికి కృషి చేస్తా ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం
### రానున్న మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యం: రంగు శేఖర్ గౌడ్



ఉప్పల్ (ప్రశ్న న్యూస్)తెలంగాణ రక్షణ సేన వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ అధ్యక్షుడిగా రంగు శేఖర్ గౌడ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు, ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రావణ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా రంగు శేఖర్ గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో డివిజన్ అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు. పార్టీ చేపట్టే ప్రతి కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని వాటిని విజయవంతం చేస్తానని పేర్కొన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేస్తానని తెలిపారు. డివిజన్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతానని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నాయకత్వంలో తెలంగాణ రక్షణ సేనను మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు, నాయకులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానని రంగు శేఖర్ గౌడ్ వెల్లడించారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని ఆయన తెలిపారు.

## విధి నిర్వహణలో అమరులైన వీరులకు జోహార్లు

### ప్రాణాలర్పించిన పోలీసుల త్యాగం చిరస్మరణీయం
### అమరవీరుల స్థూపం వద్ద ఎస్పీ వకుల్ జిందాల్ నివాళులు



గుంటూరు(ప్రశ్న న్యూస్) ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పిస్తూ.. శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా విధులు నిర్వర్తిస్తూ.. దేశం కోసం, సమాజం కోసం ప్రాణాలనే త్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలు చిరస్మరణీయమని గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఐపీఎస్ పేర్కొన్నారు. విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు వీరుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని తెలిపారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం గుంటూరులోని పాలెం పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న అమరవీరుల స్థూపం వద్ద ఆయన ఘనంగా నివాళు లర్పించారు.

### త్యాగాలకు పుష్పాంజలి

అమరవీరుల స్థూపం వద్ద ఎస్పీ వకుల్ జిందాల్ పుష్పగుచ్ఛం ఉంచి వీరుల త్యాగాలకు వందనం చేశారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఐ, ఏఆర్ సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం పోలీసు అమరవీరుల సేవలను స్మరించుకుంటూ అధికారులు, సిబ్బంది రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. విధి నిర్వహణలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజల భద్రత కోసం పోరాడిన పోలీసుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు.

## దర్శిలో వైసీపీకి షాక్..

### టీడీపీలోకి 30 మందికి పైగా చేరిక!

### గొట్టిపాటి లక్ష్మి సమక్షంలో పసుపు కండువాలు
### చిన్నగుడిపాడు వైసీపీ నాయకులకు టీడీపీ కండువాలు కప్పి ఆహ్వానం



దర్శి(ప్రశ్న న్యూస్) దర్శి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీలోకి వలసలు కొనసాగుతున్నాయి. ప్రకాశం జిల్లా దొనకొండ మండలం చిన్నగుడిపాడు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు 30 మందికి పైగా టీడీపీలో చేరారు. దర్శిలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి సమక్షంలో ఈ చేరికల కార్యక్రమం జరిగింది. వైసీపీని వీడి వచ్చిన వారికి ఆమె పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

### కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలి.

ఈ సందర్భంగా గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ దర్శి నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. గ్రామస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దొనకొండ మండల టీడీపీ అధ్యక్షుడు మోడి ఆంజనేయులు, మాజీ సర్పంచ్ బి. ఏడుకొండలు, అక్కయ్య, గుమ్మా నాగరాజు, యగ్గోని కొండయ్య తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## తుక్కాపూర్ అభివృద్ధికి ఎమ్మెల్యే భరోసా

### గ్రామ సమస్యలను పరిష్కరించాలని సర్పంచ్ ఆంజనేయులు వినతి



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) మెదక్ జిల్లా కొల్చారం మండలం తుక్కాపూర్ గ్రామ అభివృద్ధికి సహకరించాలని గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు గ్రామ సర్పంచ్ దొడ్ల ఆంజనేయులు తెలిపారు.గ్రామ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టి, ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరినట్లు సర్పంచ్ తెలిపారు. తుక్కాపూర్ సమగ్ర అభివృద్ధికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు సర్పంచ్ వెల్లడించారు. సర్పంచ్ తో పాటు ఉప సర్పంచ్ ఆరె రవీందర్ ,వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అమరుల త్యాగం.. ప్రజల రక్షణే లక్ష్యం

### విశాఖ బీచ్‌రోడ్డులో పోలీసు అమరవీరులకు
### సీపీ శంఖబ్రత బాగ్చి ఘన నివాళి



విశాఖపట్నం(ప్రశ్న న్యూస్) ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ కల్పిస్తూ దేశ భద్రత కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని విశాఖపట్నం నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. సమాజంలో శాంతిభద్రతలను కాపాడుతూ ప్రజలకు మరింత చేరువగా ఉండాలని పోలీసు సిబ్బందికి పిలుపునిచ్చారు. మారుతున్న నేరాల స్వభావానికి అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ప్రజలకు మెరుగైన సేవలందించాలని సూచించారు.పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం విశాఖపట్నం బీచ్‌రోడ్డులోని పోలీసు అమరవీరుల స్మృతి స్థూపం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో సీపీ ముఖ్య అతిథిగా పాల్గొని గౌరవ వందనం స్వీకరించారు. అమరవీరుల స్మృతి స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి త్యాగాలను స్మరించుకుంటూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, విశాఖపట్నం పోర్టు అథారిటీ చైర్మన్, నేవీ అధికారులు, పోలీసు ఉన్నతాధికారులు, వివిధ శాఖల సీనియర్ అధికారులు, రిటైర్డ్ పోలీసు అధికారులు, పోలీసు కుటుంబ సభ్యులు, పాత్రికేయులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## శ్రీశైలంలో ఆధ్యాత్మిక శోభ.. సాక్షిగణపతికి విశేష అభిషేకం

### వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు..
### భక్తిభావాన్ని పంచిన హరికథాగానం, భజనలు



శ్రీశైలం(ప్రశ్న న్యూస్) ప్రముఖ శైవక్షేత్రం శ్రీశైలంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో బుధవారం సాక్షిగణపతి స్వామివారికి విశేష అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలావీరభద్రస్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మరోవైపు దేవస్థానం చేపడుతున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా హరికథాగానం, భజన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. పూజలు, పారాయణాలు, సంప్రదాయ కళారూపాలతో శ్రీశైల క్షేత్రంలో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది.

**ఆటంకాలు తొలగించే సాక్షిగణపతి.. విశేష అభిషేకం**

శ్రీశైల మహాక్షేత్రాన్ని సందర్శించే భక్తులకు విశిష్టమైన సాక్షిగణపతి స్వామివారికి బుధవారం ఉదయం దేవస్థానం ఆధ్వర్యంలో విశేష అభిషేకం నిర్వహించారు. పంచామృతాలు, వివిధ ఫలోదకాలు, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలంతో స్వామివారికి అభిషేకం జరిపారు. అనంతరం ప్రత్యేక పుష్పార్చన, నివేదన కార్యక్రమాలు నిర్వహించారు. వైదిక సంప్రదాయాల్లో గణపతి అభిషేకానికి విశేష ప్రాధాన్యం ఉంది. విఘ్నాలను తొలగించి, చేపట్టిన కార్యాలు విజయవంతం కావాలని గణపతిని భక్తులు ఆరాధిస్తారు. ఆయురారోగ్యాలు, సిరిసంపదలు కలగాలని, విద్యార్థులకు జ్ఞాపకశక్తి, ఆలోచనా సామర్థ్యం పెరగాలని స్వామివారిని ప్రార్థిస్తారు.

# 'రామాయణ'కు క్లీన్ 'యూ' సర్టిఫికెట్..
## భారీ రన్‌టైమ్‌తో వస్తున్న చిత్రం!



దేశవ్యాప్తంగా సినీ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం 'రామాయణ'. నితీశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాకు సంబంధించి ఒక ముఖ్యమైన అప్‌డేట్ బయటకు వచ్చింది. ప్రముఖ టికెటింగ్ ప్లాట్‌ఫామ్ బుక్‌మైషో ప్రకారం, ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు క్లీన్ 'యూ' సర్టిఫికెట్ జారీ చేసింది. దీంతో ఎలాంటి వయోపరిమితి లేకుండా అందరూ ఈ చిత్రాన్ని థియేటర్లలో వీక్షించవచ్చు.బుక్‌మైషోలో పొందుపరిచిన వివరాల ప్రకారం.. 'రామాయణ' సినిమా నిడివి 3 గంటల 15 నిమిషాలుగా ఉంది. అయితే, ఈ సమాచారం ఇంకా 'సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్' (సీబీఎఫ్‌సీ) అధికారిక వెబ్‌సైట్‌లో నమోదు కాలేదు. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని, బుక్‌మైషోలో ఉన్న వివరాలే దాదాపుగా ఖరారయ్యే సూచనలు కనిపిస్తున్నాయని తెలుస్తోంది.ఇతిహాస గాథ అయిన రామాయణాన్ని వెండితెరపై ఆవిష్కరిస్తున్నందున, ఇంత భారీ రన్‌టైమ్ అవసరమేనని విశ్లేషకులు భావిస్తున్నారు. రణ్‌బీర్ కపూర్, యశ్, సాయి పల్లవి ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్, హన్స్ జిమ్మెర్ సంగీతం అందిస్తున్నారు. ఈ భారీ బడ్జెట్ చిత్రం నవంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

# 'దొంగ నా కొడుకు' టీజర్ విడుదల..
## ఆకట్టుకుంటున్న మౌళి కామెడీ ఎంటర్‌టైనర్!




టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ 'మైత్రీ మూవీ మేకర్స్' నుంచి వస్తున్న తాజా చిత్రం 'దొంగ నా కొడుకు'. ఈ సినిమాకు సంబంధించిన అధికారిక టీజర్‌ను చిత్ర బృందం తాజాగా విడుదల చేసింది. యూట్యూబ్‌లో మంచి క్రేజ్ ఉన్న మౌళి ఈ చిత్రంలో ప్రధాన పాత్రలో నటిస్తుండగా, సుస్మితా శెట్టి నాయికగా నటిస్తోంది. శ్రీను కంబాల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా టీజర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది.విడుదలైన టీజర్‌ను గమనిస్తే.. ఇది వైజాగ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఫన్ ఎలిమెంట్స్ ఉన్న చిత్రంగా కనిపిస్తోంది. మౌళి తనదైన శైలి బాడీ లాంగ్వేజ్ మరియు కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించడానికి సిద్ధమవుతున్నట్లు టీజర్ స్పష్టం చేస్తోంది. ఈ చిత్రంలో అలీ, రఘుబాబు కీలక పాత్రల్లో నటించబోతున్నారు.

## రామాయణం ఈవెంట్‌లో
# సాయి పల్లవి
### - ఊదా రంగు చీరపైనే అందరి చూపు!



నటి సాయి పల్లవి తన సహజమైన అందం, నటనతో పాటు సంప్రదాయ వస్త్రధారణతోనూ అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటారు. తాజాగా ఆమె మరోసారి తన చీరకట్టుతో అందరి దృష్టిని ఆకర్షించారు. హైదరాబాద్‌లో జరిగిన 'రామాయణం' తెలుగు ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో సాయి పల్లవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ చిత్రంలో ఆమె సీత పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. ఈ వేడుకకు సాయి పల్లవి ఊదా-లావెండర్ కలయికలో ఉన్న అందమైన టిష్యూ సిల్క్ చీరలో హాజరయ్యారు. ఆ చీరకు బంగారు వర్ణంతో చేసిన భారీ అంచు, జరీ పనితనం ప్రత్యేక అందాన్ని తెచ్చిపెట్టాయి. టిష్యూ సిల్క్ ఫ్యాబ్రిక్ కావడంతో చీరలో ఓ ప్రత్యేకమైన మెరుపు కనిపించింది. దీనికి సరిగ్గా సరిపోయేలా అదే రంగు బ్లౌజ్‌ను ధరించారు. ఈ బ్లౌజ్‌కు ముందు, వెనుక, చేతులపై బంగారు రంగు ఎంబ్రాయిడరీ వర్క్ చేశారు. మోచేతుల వరకు ఉన్న చేతులు, మాండరిన్ కాలర్ డిజైన్ ఆమె లుక్‌ను మరింత హుందాగా మార్చాయి. ఎప్పటిలాగే తన లుక్‌ను సింపుల్‌గా, సంప్రదాయబద్ధంగా ఉంచుకున్నారు. చెవులకు డ్రాప్ ఇయర్ రింగ్స్, చేతులకు అందమైన కడియాలు (కాడలు), చేతిలో జపమాల పట్టుకుని కనిపించారు. తన సహజమైన రింగుల జుట్టును సాఫ్ట్‌గా స్టైల్ చేసుకుని, అతి తక్కువ మేకప్‌తో దర్శనమిచ్చారు. గులాబీ రంగు ఐషాడో, లేత రంగు లిప్‌స్టిక్, నుదుటిపై చిన్న ఎర్ర బొట్టుతో తన రూపాన్ని పూర్తిచేశారు. నితేష్ తివారీ దర్శకత్వంలో రాబోతున్న 'రామాయణం'లో రాముడిగా రణబీర్ కపూర్ నటిస్తున్నారు. ఈ సినిమా ప్రమోషన్ల కోసం సాయి పల్లవి మొదటి నుంచి భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా చీరకట్టులోనే కనిపిస్తున్నారు. గతంలో బంగారు రంగు కంచిపట్టు, పీచ్-ఆరెంజ్ ఆర్గాన్జా సిల్క్ వంటి చీరలలో ఆమె కనిపించారు. ప్రస్తుతం ఆమె ధరించిన ఊదా-బంగారు వర్ణం చీర, రాబోయే దీపావళి పండుగకు సంప్రదాయ ఫ్యాషన్‌కు స్ఫూర్తిగా నిలుస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ చిత్రం నవంబర్ 2026లో ప్రేక్షకుల ముందుకు రానుంది.

# బాక్సాఫీస్ వద్ద 'టైగర్' వేట..
## 2026లో మూడో అతిపెద్ద భారతీయ హిట్‌గా ఘనత



సూపర్ స్టార్ రజనీకాంత్ తన బాక్సాఫీస్ స్టామినాను మరోసారి నిరూపించారు. ఆయన నటించిన తాజా చిత్రం 'జైలర్ 2' విడుదలైన కేవలం ఆరు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 541 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించి సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. ఈ అద్భుతమైన ప్రదర్శనతో 2026లో ఇప్పటివరకు విడుదలైన భారతీయ చిత్రాల్లో మూడో అతిపెద్ద హిట్‌గా నిలిచింది. ట్రేడ్ వర్గాల నివేదికల ప్రకారం, నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వం వహించిన ఈ యాక్షన్ డ్రామా ఆరో రోజైన మంగళవారం ఇండియాలో రూ. 45.55 కోట్ల నెట్ వసూలు చేసింది. దీంతో దేశీయంగా మొత్తం నెట్ కలెక్షన్లు రూ. 287.80 కోట్లకు (సుమారు రూ. 337 కోట్ల గ్రాస్) చేరాయి. దసరా పండుగ సెలవులు సినిమా వసూళ్లకు భారీగా దోహదపడ్డాయి. మరోవైపు, ఓవర్సీస్ మార్కెట్ల నుంచి సుమారు రూ. 204 కోట్లు రావడంతో ప్రపంచవ్యాప్త గ్రాస్ రూ. 541 కోట్లు దాటింది. ఈ ఏడాది విడుదలైన చిత్రాల్లో 'ధురంధర్ 2' (రూ. 1,800 కోట్లకు పైగా), 'దృశ్యం 3' (రూ. 556 కోట్లు) తర్వాత 'జైలర్ 2' మూడో స్థానంలో ఉంది. సన్ పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రం 2023లో బ్లాక్‌బస్టర్ అయిన 'జైలర్'కు సీక్వెల్‌గా తెరకెక్కింది. ఇందులో రజినీకాంత్ 'టైగర్ ముత్తువేల్ పాండియన్' పాత్రను కొనసాగించగా, రమ్యకృష్ణ, విద్యాబాలన్, మిథున్ చక్రవర్తి, యోగిబాబు కీలక పాత్రల్లో నటించారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించారు. థియేటర్లలో ప్రేక్షకుల స్పందన అద్భుతంగా ఉందని దర్శకుడు నెల్సన్ సంతోషం వ్యక్తం చేశారు. ఇదే జోరు కొనసాగితే, 'జైలర్' మొదటి భాగం లైఫ్‌టైమ్ కలెక్షన్లను కూడా ఈ చిత్రం అధిగమిస్తుందని ట్రేడ్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# నయనతార 'మహాశక్తి' ట్రైలర్ విడుదల..
## ఆకట్టుకుంటున్న విజువల్స్!




లేడీ సూపర్‌స్టార్ నయనతార ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా భారీ చిత్రానికి సంబంధించి మేకర్స్ కీలక అప్‌డేట్ ఇచ్చారు. సుందర్ సి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి 'మహాశక్తి' (ఔశీతీశ్రీస శీట మీఖ్రఘ్రుయిఖనీష్ట్రఱ) అనే టైటిల్‌ను ఖరారు చేశారు. దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ సినిమాకు సంబంధించిన తెలుగు ట్రైలర్‌ను చిత్ర బృందం విడుదల చేసింది.వెల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ పతాకంపై డా. ఇషారి కె. గణేష్ ఈ చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తుండగా, హిప్ హాప్ తమిళా సంగీతం అందిస్తున్నారు. తాజాగా విడుదలైన ట్రైలర్‌లో నయనతార అత్యంత శక్తివంతమైన, పవర్‌ఫుల్ పాత్రలో కనిపించి ప్రేక్షకులను కట్టిపడేశారు. అద్భుతమైన విజువల్ ఎఫెక్ట్స్, బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ సినిమాపై భారీ అంచనాలను పెంచేలా ఉన్నాయి. త్వరలోనే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

# బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్తున్న 'రణబాలి'..
## 24 గంటల్లోనే 1.39 లక్షల టికెట్ల విక్రయం!

టాలీవుడ్ రౌడీ హీరో విజయ్ దేవరకొండ కథానాయకుడిగా రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో తెరకెక్కిన పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'రణబాలి' బాక్సాఫీస్ వద్ద తన జోరును కొనసాగిస్తోంది. రష్మిక మందన్న నాయికగా నటించిన ఈ చిత్రం, విడుదలైనప్పటి నుంచి ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందనను సొంతం చేసుకుంటోంది. తాజాగా ఈ సినిమా బుకింగ్స్‌కు సంబంధించి మేకర్స్ వెల్లడించిన అప్‌డేట్ టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది.

గత 24 గంటల వ్యవధిలో ఈ చిత్రానికి సంబంధించి భారీ స్థాయిలో 1,39,740 టికెట్లు అమ్ముడయ్యాయి. బాక్సాఫీస్ వద్ద సినిమా దూసుకుపోతుండటానికి ఈ టికెట్ విక్రయాలే నిదర్శనమని చిత్ర బృందం స్పష్టం చేసింది. హీరో విజయ్ దేవరకొండపై ఉన్న మాస్ క్రేజ్, సినిమాకు వస్తున్న మౌత్ టాక్ కారణంగా కలెక్షన్ల జోరు మరింత పెరిగింది. రాయలసీమ నేపథ్యంలో సాగే చారిత్రక కథాంశం, యాక్షన్ ఘట్టాలు ప్రేక్షకులను థియేటర్ల వైపు రప్పించేలా చేస్తున్నాయి. కలెక్షన్ల పరంగానూ ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద బలమైన వసూళ్లను రాబడుతూ దూసుకెళ్తోంది.



# భక్తిశ్రద్ధలతో దుర్గాభవాని అమ్మవారి శోభాయాత్ర

### తొమ్మిది రోజుల పాటు వైభవంగా నవరాత్రి ఉత్సవాలు

మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) కొల్చారం మండలవ్యాప్తంగా దుర్గాభవాని నవరాత్రి ఉత్సవాలు తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. నవరాత్రుల సందర్భంగా అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారి శోభాయాత్రను భక్తులు ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించిన అనంతరం శోభాయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మంగళ వాయిద్యాలు, భక్తుల జయజయధ్వానాల మధ్య శోభాయాత్ర భక్తిమయ వాతావరణంలో కొనసాగింది. దుర్గాభవాని అమ్మవారి కృపాకటాక్షాలతో మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని భక్తులు ప్రార్థించారు. నవరాత్రి ఉత్సవాలు, శోభాయాత్రతో మండలవ్యాప్తంగా ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో దుర్గాభవాని కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు, మహిళలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పశ్చిమంలో బీసీలకు టీడీపీ పెద్దపీట

### అభ్యర్థులకు బీ-ఫారాలు అందజేసిన

### ఎంపీ కేశినేని చిన్ని, బుద్ధా వెంకన్న, నాగుల్‌మీరా



విజయవాడ(ప్రశ్న న్యూస్) రాజకీయాల్లో సామాజిక సమీకరణాలకు ప్రాధాన్యం.. అభ్యర్థుల ఎంపికలో బీసీలకు పెద్దపీట! విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్ అభ్యర్థుల ఎంపికలో వెనుకబడిన తరగతులకు (బీసీ) అధిక ప్రాధాన్యం కల్పించడంపై రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. మొత్తం 17 మంది కార్పొరేటర్ అభ్యర్థుల్లో 11 మందికి బీసీల నుంచి అవకాశం కల్పించడం సామాజిక న్యాయానికి నిదర్శనమని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ చిన్ని పేర్కొన్నారు. మరోవైపు రానున్న ఎన్నికల్లో అన్ని డివిజన్లలో కూటమి అభ్యర్థులను గెలిపించడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

### బీసీలకు రాజకీయ ప్రాధాన్యం!

విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన టీడీపీ కార్పొరేటర్ అభ్యర్థులకు ఎంపీ కేశినేని శివనాథ్ చిన్ని, మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న, నాగుల్‌మీరా బీ-ఫారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ చిన్ని మాట్లాడుతూ.. పశ్చిమ నియోజకవర్గంలో 17 మంది అభ్యర్థుల్లో 11 మందికి బీసీల నుంచి అవకాశం కల్పించడం సంతోషకరమన్నారు. బీసీలకు రాజకీయంగా తగిన ప్రాధాన్యం కల్పించడంలో టీడీపీ ముందుంటుందని చెప్పారు. అన్ని వర్గాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పిస్తూ ప్రజాస్వామ్య విలువలకు అనుగుణంగా పార్టీ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. బీసీ అభ్యర్థులకు అధిక సంఖ్యలో అవకాశాలు కల్పించడం సామాజిక న్యాయం పట్ల పార్టీ నిబద్ధతను ప్రతిబింబిస్తోందని అన్నారు.

### పశ్చిమంపై గురి.. అన్ని డివిజన్లలో గెలుపే లక్ష్యం..

విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో కూటమి అభ్యర్థులను గెలిపించుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని కేశినేని చిన్ని స్పష్టం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల మద్దతుతో నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో విజయం సాధించేందుకు ప్రయత్నిస్తామని ధీమా వ్యక్తం చేశారు. అభ్యర్థుల ఎంపికతోనే సరిపెట్టుకోకుండా, ప్రజల్లోకి వెళ్లి వారి సమస్యలను తెలుసుకుంటూ పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

# విజయమే లక్ష్యం.. కూటమి శ్రేణులకు బొండా ఉమా దిశానిర్దేశం

### సెంట్రల్‌లో 21 డివిజన్ల టీడీపీ అభ్యర్థులకు బీ-ఫారాలు

### మేయర్ అభ్యర్థి వంగవీటి రాధాకు లక్ష ఓట్ల మెజార్టీ లక్ష్యం



విజయవాడ(ప్రశ్న న్యూస్) విజయవాడ నగరపాలక సంస్థ ఎన్నికలపై ఎన్డీఏ కూటమి గురిపెట్టింది. నగరంలోని అన్ని డివిజన్లలో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా కార్యాచరణకు దిగింది. ఈ క్రమంలో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో పార్టీ శ్రేణులను సమాయత్తం చేస్తూ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ముందుకు సాగుతున్నారు. మొగల్రాజపురంలోని తన నివాసంలో బుధవారం సెంట్రల్ నియోజకవర్గంలోని 21 డివిజన్లకు చెందిన టీడీపీ అభ్యర్థులకు బీ-ఫారాలు అందజేశారు. యువనాయకుడు బొండా సిద్ధార్థతో కలిసి అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

### సమన్వయంతో ముందుకు

నగరపాలక సంస్థ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీతో కూడిన ఎన్డీఏ కూటమి ఐక్యంగా పనిచేస్తోందని కూటమి నాయకులు పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు వ్యక్తిగత విభేదాలకు తావివ్వకుండా అధిష్ఠానం నిర్ణయాలను గౌరవించాలని సూచించారు. కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. విజయవాడ మేయర్ అభ్యర్థి వంగవీటి రాధాకృష్ణను లక్ష ఓట్లకు పైగా మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేస్తున్నామని నాయకులు తెలిపారు. నగరంలోని 86 డివిజన్లలోనూ కూటమి అభ్యర్థుల గెలుపు కోసం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నట్లు వెల్లడించారు. నగర అభివృద్ధి కోసం మేయర్ అభ్యర్థి వంగవీటి రాధాకృష్ణతో పాటు ఎన్డీఏ కూటమి అభ్యర్థులకు ప్రజలు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

# ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భవాని భక్తులు

# ఎరుపెక్కిన బెజవాడ వీధులు

- సాయంత్రం 5 గంటలకే 1.39 లక్షల మందికి దర్శనం,మరో 35 వేల మంది నిరీక్షణ
- పది రోజుల్లో 31 లక్షల మంచినీటి బాటిళ్ల పంపిణీ, నిరంతరాయంగా అన్నప్రసాద వితరణ



విజయవాడ(ప్రశ్న న్యూస్) ఇంద్రకీలాద్రి భవానీమయం.. బెజవాడ భక్తజన సంద్రమయం! దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ముగిసినా.. అమ్మవారి సన్నిధిలో భక్తుల సందడి ఏమాత్రం తగ్గలేదు. భవానీ దీక్షలు స్వీకరించిన భక్తులు ఎర్రని వస్త్రధారణతో వేలాదిగా తరలిరావడంతో విజయవాడ నగర వీధులన్నీ ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. కొండపై కొలువైన శ్రీ కనకదుర్గమ్మవారు శ్రీ రాజరాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిస్తుండటంతో అమ్మవారిని కనులారా దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. ఇటు వినాయక గుడి నుంచి.. అటు కుమ్మరిపాలెం సెంటర్ మీదుగా సాగుతున్న భక్తజన ప్రవాహంతో ఇంద్రకీలాద్రి పరిసరాలు కిక్కిరిసిపోయాయి. దసరా ఉత్సవాల అనంతరం తొలి రోజే భక్తుల రద్దీ ఈ స్థాయిలో ఉండటంతో దేవస్థానం అధికారులు, పోలీసు యంత్రాంగం అప్రమత్తమయ్యారు. తెల్లవారుజాము నుంచే దర్శన క్యూలైన్లు, ఘాట్‌రోడ్డు, హోల్డింగ్ ఏరియాల్లో పర్యవేక్షణను ముమ్మరం చేశారు. బుధవారం సాయంత్రం 5 గంటల సమయానికి 1,39,000 మంది భక్తులు అమ్మవారిని దర్శించుకోగా.. మరో 35 వేల మంది భక్తులు దర్శనం కోసం నిరీక్షిస్తున్నారు. ఉత్తరాంధ్రతో పాటు ఉభయ గోదావరి జిల్లాల నుంచి ప్రత్యేక రైళ్లు, ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాల్లో భవానీ భక్తులు భారీగా విజయవాడకు చేరుకుంటున్నారు.

### ఎటుచూసినా ఎర్రని వస్త్రాల..

భవానీ దీక్ష చేపట్టిన భక్తులతో ఇంద్రకీలాద్రి మార్గాలు ఎరుపెక్కాయి. కొండపైకి చేరుకునేందుకు భక్తులు క్రమపద్ధతిలో క్యూలైన్లలో ముందుకు సాగుతున్నారు. సీతమ్మవారి పాదాలు, ఓం టర్నింగ్, వినాయక గుడి, కుమ్మరిపాలెం సెంటర్ ప్రాంతాల్లో భక్తుల రద్దీ స్పష్టంగా కనిపించింది. ఘాట్‌రోడ్డులోని మూడు హోల్డింగ్ ఏరియాలతో పాటు స్నానాల రేవుల వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో వేచి ఉన్నారు.

భక్తుల ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో ఎక్కడా తొక్కిసలాటకు తావులేకుండా అధికారులు చర్యలు చేపట్టారు. రద్దీ అధికంగా ఉన్న ప్రాంతాల్లో పోలీసు సిబ్బంది ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి భక్తులను క్రమబద్ధీకరించారు. క్యూలైన్ల నిర్వహణతో పాటు లడ్డూ ప్రసాదం కౌంటర్ల వద్ద కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

### క్షేత్రస్థాయిలో ఈవో పర్యవేక్షణ..

భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ తెల్లవారుజాము నుంచే క్షేత్రస్థాయిలో పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు. పోలీసు అధికారులతో సమన్వయం చేసుకుంటూ రద్దీ నియంత్రణ, దర్శన ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. విధుల్లో నిమగ్నమైన దేవస్థానం, పోలీసు సిబ్బందికి అవసరమైన సహకారం అందిస్తూ వారికి అండగా నిలుస్తున్నారు.

ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), ఈవో శీనా నాయక్, బోర్డు సభ్యులు, వివిధ విభాగాల అధికారులు క్యూలైన్లు, ఘాట్‌రోడ్డు పరిసరాల్లో పర్యటిస్తూ భక్తులకు ఎదురవుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఆలయ ఈఈ రమాదేవి, సహాయ కార్యనిర్వహణాధికారులు చంద్రశేఖర్, రమేష్‌బాబు, డాక్టర్ కె. గంగాధర్, సుధారాణి, లక్ష్మీప్రసన్న తదితరులు క్షేత్రస్థాయిలో ఉండి పోలీసు విభాగం, దేవస్థానం సిబ్బందితో సమన్వయం చేసుకుంటున్నారు. భారీ రద్దీ మధ్య దర్శనాలు సాఫీగా సాగేలా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

# జనంలో ఉండే నాయకత్వానికే పట్టం

### బుచ్చిరెడ్డిపాళెం అభివృద్ధికి కూటమితోనే భరోసా

### 'చెప్పాం.. చేస్తున్నాం' ఇంటింటి ప్రచారంలో: ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



బుచ్చిరెడ్డిపాళెం(ప్రశ్న న్యూస్) ప్రజల్లో ఉంటూ.. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ.. అభివృద్ధికి బాటలు వేసే నాయకత్వానికే ప్రాధాన్యం ఇవ్వాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పిలుపునిచ్చారు. బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. బుధవారం మున్సిపాలిటీలోని 6, 7, 8 వార్డుల్లో నిర్వహించిన 'చెప్పాం.. చేస్తున్నాం' ఇంటింటి ప్రచారంలో ఆమె పాల్గొని ప్రజలతో మమేకమయ్యారు. పట్టణంలో గతంలో ఉన్న పరిస్థితులకు, ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు పరిశీలించాలని సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థి దొడ్ల విజయలక్ష్మితో పాటు 6వ వార్డు కూటమి అభ్యర్థి బిట్రగుంట సరోజనమ్మ, 7వ వార్డు టీడీపీ అభ్యర్థి నెల్లూరు దయాకర్ రెడ్డి, 8వ వార్డు జనసేన అభ్యర్థి కత్తి మహేష్‌లను ప్రజలకు పరిచయం చేస్తూ వారి విజయానికి సహకరించాలని ఎమ్మెల్యే కోరారు.

### విజయలక్ష్మికి అవకాశం ఇవ్వండి

మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థి దొడ్ల విజయలక్ష్మి వవ్వేరు కో-ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్‌గా పనిచేసిన సమయంలో గతంలో చోటుచేసుకున్న అవకతవకలను సరిదిద్దేందుకు రెండేళ్లపాటు కృషి చేశారని ఎమ్మెల్యే వివరించారు. నీతి, నిజాయతీకి ప్రాధాన్యం ఇచ్చే కుటుంబం నుంచి వచ్చిన విజయలక్ష్మికి మున్సిపాలిటీ బాధ్యతలు అప్పగిస్తే ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. పారదర్శకమైన పాలనతో పాటు పట్టణ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లే నాయకత్వం అవసరమని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి, సమస్యలకు పరిష్కారాలు చూపగల వారిని ఎన్నుకోవాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు భవిష్యత్తులో తగిన గుర్తింపు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

# స్థానిక సమరంలో టీడీపీ దూకుడు

### తిరుపతి నుంచి రేణిగుంట వరకు ఎన్నికల వేడి



తిరుపతి(ప్రశ్న న్యూస్) స్థానిక సంస్థల ఎన్నికలతో తిరుపతి జిల్లా రాజకీయాలు వేడెక్కుతున్నాయి. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలతో పాటు తిరుపతి నగరపాలక సంస్థ ఎన్నికలపై తెలుగుదేశం పార్టీ ప్రత్యేక దృష్టి సారించింది. ఒకవైపు అభ్యర్థులకు బీ-ఫారాల పంపిణీ.. మరోవైపు నామినేషన్ కేంద్రాల పరిశీలన.. ఇంకోవైపు క్షేత్రస్థాయి నాయకులతో సమీక్షలు.. ఇలా ఎన్నికల ప్రక్రియలో పార్టీ యంత్రాంగాన్ని సమాయత్తం చేస్తోంది. రేణిగుంట మండలంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా తుడా ఛైర్మన్ డా. డాలర్స్ దివాకర్ రెడ్డి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

### రేణిగుంటలో క్లీన్‌స్వీప్ వ్యూహం..

రేణిగుంట మండల స్థాయి నాయకులు, కార్యకర్తలతో డా. డాలర్స్ దివాకర్ రెడ్డి విస్తృత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి ఎంపీటీసీ స్థానంతో పాటు జడ్పీటీసీ స్థానాన్ని కూడా అత్యధిక మెజారిటీతో గెలుచుకోవడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మండలంలోని గ్రామ పంచాయతీల పరిధిలో పార్టీ బలోపేతం, బూత్ స్థాయి కమిటీల సన్నద్ధత, ఓటర్ల జాబితాల పరిశీలన, ఎన్నికల వ్యూహాలపై నాయకులతో చర్చించారు. అంతర్గత విభేదాలను పక్కనపెట్టి ఐకమత్యంతో ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. గ్రామస్థాయిలో ప్రజలతో మమేకమవుతూ వారి సమస్యలను తెలుసుకోవాలని సూచించారు.

### తిరుపతి కార్పొరేషన్‌పై గురి..

తిరుపతి నగరపాలక సంస్థ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులకు అధికారిక బీ-ఫారాలను డా. డాలర్స్ దివాకర్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమానికి పనబాక లక్ష్మి, నూకసాని బాలాజీ, సుగుణమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్పొరేషన్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం సాధించి మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుంటుందని టీడీపీ ముఖ్య నేతలు ధీమా వ్యక్తం చేశారు. బీ-ఫారాలు అందుకున్న అభ్యర్థులు తమకు అవకాశం కల్పించిన పార్టీ అధిష్ఠానానికి, స్థానిక నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో విజయం సాధించేందుకు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి నగర టీడీపీ నాయకులు, వివిధ డివిజన్ల ఇన్‌ఛార్జులు, క్లస్టర్, యూనిట్, బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రేణిగుంటలో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల్లో క్లీన్‌స్వీప్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న డా. డాలర్స్ దివాకర్ రెడ్డి.. తిరుపతి కార్పొరేషన్‌లో మేయర్ పీఠాన్ని దక్కించుకోవాలన్న పార్టీ లక్ష్యానికి అనుగుణంగా అభ్యర్థులు, నాయకులు సమన్వయంతో పనిచేయాలని సూచిస్తున్నారు.

# శ్రీకాళహస్తిలో దేవి నవరాత్రుల వైభవం

# మహర్నవమి వేడుకలకు పోటెత్తిన భక్తజనం



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) శ్రీకాళహస్తిలో భక్తిపారవశ్యంవైభవంగా ముగిసిన శ్రీ ముత్యాలమ్మ తల్లి ఉత్సవాల. భక్తులకు నిజరూప దర్శనం. అమ్మవారిని దర్శించుకున్న వేలాది మంది భక్తులు. శ్రీకాళహస్తి దివ్యక్షేత్రంలో శ్రీ ముత్యాలమ్మ తల్లి ఉత్సవాలు భక్తిశ్రద్ధల నడుమ వైభవంగా ముగిశాయి. ఉత్సవాల చివరి రోజైన నేడు అమ్మవారు భక్తులకు నిజరూప దర్శనమిచ్చి అనుగ్రహించారు. స్వర్ణముఖి నదీ తీరాన, శ్రీకాళహస్తీశ్వర స్వామివారి పవిత్ర క్షేత్రంలో కొలువైన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. నిజరూప దర్శనంతో పులకించిన భక్తులు. అమ్మవారిని నిజరూపంలో దర్శించుకోవాలనే ఆకాంక్షతో భక్తులు ఉదయం నుంచే ఆలయానికి చేరుకున్నారు. తమ కష్టాలను తొలగించి, కుటుంబాలకు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ముత్యాలమ్మ తల్లిని భక్తితో ప్రార్థించారు. అమ్మవారి దర్శనంతో భక్తులు ఆధ్యాత్మిక ఆనందంలో మునిగిపోయారు. భక్తులతో కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం. ఉత్సవాల చివరి రోజు కావడంతో శ్రీకాళహస్తిలో భక్తుల సందడి నెలకొంది. లోకకల్యాణం కోసం ప్రార్థనలు,అమ్మవారి చల్లని చూపులు ప్రతి కుటుంబంపైనా ఉండాలని, ప్రజలందరికీ సిరిసంపదలు, సుఖశాంతులు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని భక్తులు ప్రార్థించారు. భక్తుల ఆధ్యాత్మిక ఉత్సాహం మధ్య శ్రీ ముత్యాలమ్మ తల్లి ఉత్సవాలు ముగింపు ఘట్టానికి చేరుకున్నాయి.

# బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో బాల కార్మికుల కలకలం

- కొబ్బరికాయలు కొట్టే చోట చిన్నారులతో చాకిరీ.. భక్తుల నుంచి డబ్బుల వసూళ్లు
- కాంట్రాక్టర్ కనుసైగల్లో వ్యవహారం.. ఈవో, సూపరింటెండెంట్ పర్యవేక్షణ ఏదీ.?
- కొబ్బరికాయలో భక్తుడికి చిన్న ముక్క.. కాంట్రాక్టర్‌కు పెద్ద ముక్క
- గతంలోనూ ఈవో, సిబ్బంది నిర్లక్ష్యంపై సస్పెన్షన్.. అయిన మారని అధికారుల తీరు
- దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ విధులు నిర్వహించడం లేదా పర్యవేక్షణ ఎక్కడ.?
- కాంట్రాక్టుల వెనుక రాజకీయ అండదండలా.? భారీగా నగదు చేతులు మారుతున్నాయన్న ఆరోపణలు
- దేవాదాయ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో ఆలయాలలో ప్రసాదం కరువు, కమిషనర్ ఆదేశాలు ఉన్న పట్టించుకోని ఈవోలు







హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) భక్తుల కొంగుబంగారంగా పేరొందిన బల్కంపేట శ్రీ ఎల్లమ్మ దేవాలయంలో బాల కార్మికుల వినియోగం, కొబ్బరికాయలు కొట్టే కేంద్రంలో డబ్బుల వసూళ్లు, పారిశుద్ధ్య లోపాలు తీవ్ర చర్చనీయాంశంగా మారుతున్నాయి. భక్తులకు సౌకర్యాలు కల్పించాల్సిన ఆలయ ప్రాంగణంలో చిన్నారులతో పనులు చేయిస్తున్నారనే ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఆలయ నిర్వహణ బాధ్యతలు చూసుకోవాల్సిన అధికారుల పర్యవేక్షణ ఎక్కడ.? కాంట్రాక్టర్ వ్యవహారాలపై నిఘా లేదా.? అన్న ప్రశ్నలు భక్తుల నుంచి వినిపిస్తున్నాయి.

## బాల కార్మికులతో పనులు.. బాధ్యత ఎవరిది.?

ఆలయంలో కొబ్బరికాయలు కొట్టే ప్రాంతంలో చిన్నారులను పనిలో పెట్టుకున్నారనే ఆరోపణలు వెలుగులోకి రావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. కొబ్బరికాయలు కొట్టడం, భక్తుల నుంచి డబ్బులు తీసుకోవడం వంటి పనుల్లో బాల కార్మికులు కనిపిస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. డబ్బులు ఎవరు అడగమన్నారని ప్రశ్నిస్తే కాంట్రాక్టర్ పేరును ప్రస్తావిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో కాంట్రాక్టర్ కు ఈవో, సూపర్డెంట్ సహకారం ఎంత.? చిన్నారులను పనిలో పెట్టుకోవడానికి అనుమతి ఎవరిచ్చారు.? ఆలయ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారా.? నిర్వహిస్తే ఎందుకు పిల్లలను పెట్టుకున్నారని ప్రశ్నించలేదు అంటే కాంట్రాక్టర్ తో అధికారులు సిబ్బంది కుమ్మకయ్యారా.? అన్న అంశాలపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉంది. దీనిపై స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సైతం మౌనం వహించడం పై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బాలలను పనిలో పెట్టుకోవడం చట్టపరంగా నిషేధితమైన సందర్భాల్లో కాంట్రాక్టర్, ఈవో, సూపర్డెంట్ లపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా బాలల వయస్సు, వారు చేస్తున్న పని స్వభావం, పని పరిస్థితులను అధికారులు పరిశీలించాలి. సీసీ కెమెరాలు పరిశీలించి బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి.

## భక్తుడికి చిన్న ముక్క.. కాంట్రాక్టర్‌కు పెద్ద వాటా.?

కొబ్బరికాయలు కొట్టే క్రమంలో భక్తులకు అందించే ముక్క చిన్నదిగా ఉండగా, మిగిలిన పెద్ద భాగాన్ని కాంట్రాక్టర్ వైపు తీసుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దానికి తోడు కొబ్బరి నీళ్లను బాటలలో నింపి అమ్ముకోవడం జరుగుతుందని, భక్తులు సమర్పించే కొబ్బరికాయల విషయంలో పారదర్శకత పాటిస్తున్నారా.?

కొబ్బరికాయలు కొట్టేందుకు వసూలు చేస్తున్న డబ్బులకు అధికారిక రుసుముల వివరాలు ప్రదర్శిస్తున్నారా.? ఆదాయం ఎవరి ఖాతాలోకి వెళ్తోంది.? అన్న ప్రశ్నలకు ఈవో సమాధానాలు చెప్పాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. భక్తుల విశ్వాసాన్ని వ్యాపార ప్రయోజనాలకు వాడుకుంటున్నారనే అనుమానాలకు తెరదించాల్సిన బాధ్యత దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, కమిషనర్ పైనే ఉంది.

## కాంట్రాక్టు కేటాయింపుల్లో రాజకీయ పలుకుబడి ఉందా.?

కొబ్బరికాయల కాంట్రాక్టు వ్యవహారంలో రాజకీయ అండదండలు ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాంట్రాక్టు కేటాయింపులు పారదర్శకంగా జరిగాయా.? టెండర్ నిబంధనలు పాటించారా.? ఆలయానికి రావాల్సిన ఆదాయం పూర్తిస్థాయిలో వస్తోందా.? కాంట్రాక్టు ద్వారా భారీగా నగదు చేతులు మారుతోందన్న ఆరోపణల్లో వాస్తవమెంత.? అనే అంశాలను ఉన్నతాధికారులు పరిశీలించాలి. కొంతమంది రాజకీయ నాయకుల కనుసైగల్లోనే టెండర్ల వ్యవహారం జరుగుతుందన్న విమర్శలు ఉన్నాయి.

## గత ఘటనల నుంచి గుణపాఠం లేదా.?

గతంలోనూ ఆలయ నిర్వహణలో నిర్లక్ష్యానికి సంబంధించి అప్పటి ఈవో, సిబ్బందిపై సస్పెన్షన్ వేటు పడినట్లు సమాచారం. అయినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో పర్యవేక్షణ లోపాలపై మళ్లీ విమర్శలు రావడం అధికారుల పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. గత ఘటనల నుంచి అధికారులు ఏం నేర్చుకున్నారు.? బాధ్యతలు నిర్వర్తించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకునే వ్యవస్థ ఉందా.? కాంట్రాక్టర్ వ్యవహారాలపై ఈవో, సూపరింటెండెంట్ ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నారా.? స్థానిక ఎమ్మెల్యే ఈ సమస్యలపై దృష్టి పెడుతున్నారా.? ఇంత జరుగుతున్న స్థానిక ఎమ్మెల్యే ఎందుకు బల్కంపేట దేవాలయం పై దృష్టి పెట్టడం లేదనే అనే ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

## ప్రవేశ ద్వారం వద్ద అపరిశుభ్రత.. భక్తులకు ఇబ్బందులు

ఆలయ ప్రవేశ ద్వారం సమీపంలోని గణేశ్ విగ్రహం వద్ద అపరిశుభ్ర వాతావరణం, నీరు నిల్వ ఉండటంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే ఆలయంలో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం ఏమిటని భక్తులు ప్రశ్నిస్తున్నారు. తాగునీరు, పరిసరాల పరిశుభ్రత, వ్యర్థాల తొలగింపు వంటి కనీస సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సి ఉంది.

## ఆదాయంపైనే శ్రద్ధా.. భక్తుల సౌకర్యాలు పట్టవా.?

ఆలయానికి వచ్చే ఆదాయం, కాంట్రాక్టుల నిర్వహణపై చూపుతున్న శ్రద్ధను భక్తుల సౌకర్యాలు, ప్రసాదం నాణ్యత, పారిశుద్ధ్యంపై కూడా చూపించాలని భక్తులు కోరుతున్నారు. ఈవో, సూపరింటెండెంట్‌తో పాటు దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు తక్షణమే క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించి, బాల కార్మికుల వినియోగం, వసూళ్లు, కాంట్రాక్టు నిబంధనలు, పారిశుద్ధ్య లోపాలపై విచారణ జరపాలి. ఆరోపణలు నిర్ధారణ అయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్పందించి భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలవాల్సిన ఆలయంలో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా పారదర్శకమైన నిర్వహణను అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# ఎస్ఈసీకి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

## - 19 చోట్ల అభ్యర్థుల జాబితా వాయిదా



న్యూఢిల్లీ / అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా నామినేషన్ల గడువును పొడిగించేందుకు నిరాకరించిన ధర్మాసనం, వైసీపీ ఫిర్యాదు చేసిన నిర్దిష్ట ప్రాంతాల్లో మాత్రం పరిశీలన జరపాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని (ఎస్‌ఈసీ) ఆదేశించింది. దీంతో పాటు, అభ్యర్థుల తుది జాబితా ప్రకటనను అక్టోబర్ 25వ తేదీకి వాయిదా వేసింది. తమ అభ్యర్థులను 19 చోట్ల నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని, హింసకు పాల్పడ్డారని ఆరోపిస్తూ వైసీపీ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలు రాజ్యాంగ మౌలిక స్వరూపంలో భాగమని, ఈ ప్రక్రియకు విఘాతం కలుగుతుంటే రాజ్యాంగ కోర్టులు మౌనంగా ఉండలేవని ఈ సందర్భంగా ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఫిర్యాదులు అందిన ప్రాంతాల్లో వాటిని పరిశీలించి, నామినేషన్ల స్వీకరణకు అవకాశం కల్పించాలా వద్దా అనే దానిపై రేపటి లోగా నిర్ణయం తీసుకోవాలని ఎస్‌ఈసీని ఆదేశించింది. అవసరమైతే జిల్లా కలెక్టర్ ఎదుట నామినేషన్లు వేసే అవకాశం కల్పించాలని సూచించింది. ఈ వ్యవహారంలో తీసుకున్న చర్యలపై అక్టోబర్ 27న తమకు నివేదిక సమర్పించాలని సుప్రీంకోర్టు ఎస్‌ఈసీని ఆదేశిస్తూ, తదుపరి విచారణను అదే రోజుకు వాయిదా వేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఇప్పుడు అందరి దృష్టి రాష్ట్ర ఎన్నికల సంఘం తీసుకోబోయే నిర్ణయంపైనే కేంద్రీకృతమైంది.

# బంధించిన 4 పాలపిట్టలకు విముక్తి

## - నిందితులపై కఠిన చర్యలు తప్పవన్న సీపీ సజ్జనార్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) దసరా పండుగ సందర్భంగా కొందరు స్వార్థపరులు బోనుల్లో బంధించిన తెలంగాణ రాష్ట్ర పక్షి 'పాలపిట్ట'లకు హైదరాబాద్ నగర పోలీసులు విముక్తి కల్పించారు. పౌరుల నుంచి అందిన పక్కా సమాచారంతో మూడు వేర్వేరు ప్రాంతాల్లో దాడులు నిర్వహించి, మొత్తం నాలుగు పాలపిట్టలను కాపాడినట్లు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీపీ సజ్జనార్ వెల్లడించారు. దసరా పండుగ నాడు పాలపిట్టను చూడటం శుభసూచకంగా భావించే సంప్రదాయాన్ని కొందరు సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నించారు. మూగజీవాలను హింసిస్తే కఠిన చర్యలు తప్పవని ముందుగానే హెచ్చరించినా, కొందరు వాటిని పెడచెవిన పెట్టారు. లంగర్‌హౌస్ బాపూఘాట్ వద్ద ఓ ఆలయం దగ్గర రెండు పాలపిట్టలను, ఛత్రినాక శ్రీ చిత్రగుప్త స్వామి ఆలయం వద్ద ఒకటి, మంగళ్‌హాట్ బాలాజీనగర్ ఆలయం సమీపంలో మరో పాలపిట్టను బోనుల్లో బంధించి ఉంచారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే స్పందించి ఆయా ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. తీవ్ర యాతనకు గురవుతున్న నాలుగు పాలపిట్టలను స్వాధీనం చేసుకుని, వాటిని కేబీఆర్ పార్క్ అటవీ శాఖ అధికారులకు సురక్షితంగా అప్పగించారు. ఈ ఘటనలకు పాల్పడిన నిందితులపై అటవీ శాఖ అధికారుల సమన్వయంతో కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు సజ్జనార్ తెలిపారు. "స్వేచ్ఛగా ఎగరాల్సిన పక్షిని పండుగ పేరుతో బంధించి, తిండి, నీరు లేకుండా హింసించడం ఎవరికీ మంచిది కాదు. బోనులోని పక్షి ఆర్తనాదాలతో శుభం ఎలా కనిపిస్తుంది? జీవుల పట్ల కరుణ చూపడమే నిజమైన భక్తి కానీ, ప్రకృతిని బంధించడం కాదు" అని ఆయన తన ట్వీట్‌లో పేర్కొన్నారు. ఇలాంటి అమానవీయ చర్యలను ఎవరూ ప్రోత్సహించవద్దని, వన్యప్రాణులకు హాని తలపెట్టే ఘటనలు ఎక్కడ జరిగినా వెంటనే 18004255364, 9803338666 లేదా డయల్ 112కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# అశుభ్రతకు నిలయంగా సికింద్రాబాద్ నియోజకవర్గం

- రోడ్లపై చెత్త కుప్పలు, మట్టి దిబ్బలు, గుంతలమయంగా రహదారులు
- లాలాపేట పెద్ద నాలా వద్ద మురుగునీటి దుర్గంధం.. మున్సిపల్ యంత్రాంగం పర్యవేక్షణ ఏది.?
- ప్రజల సమస్యలు పట్టని పాలకులు.. ప్రశ్నించే దమ్ము లేని ప్రతిపక్ష నేతలు
- తెల్లచొక్కాలకే పరిమితమైన నాయకత్వం.. ప్రజలకు దక్కని ఒక్క పరిష్కారం

సికింద్రాబాద్ (ప్రశ్న న్యూస్)సికింద్రాబాద్ నియోజకవర్గంలో ప్రజా సమస్యలు రోజురోజుకూ తీవ్రంగా పేరుకుపోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.? రోడ్లపై చెత్త కుప్పలు, వీధుల్లో మట్టి దిబ్బలు, గుంతలమయంగా మారిన రహదారులు, డ్రెయిన్లలో నిలిచిపోయిన మురుగునీరు.. వెరసి నియోజకవర్గంలోని అనేక ప్రాంతాల్లో అపరిశుభ్రత ప్రజలను నానా ఇబ్బందులకు గురిచేస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అధికారులు ఎక్కడున్నారు.? సమస్యలను పరిష్కరించాల్సిన ప్రజాప్రతినిధులు ఏం చేస్తున్నారు.? అన్న ప్రశ్నలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి.




## రోడ్లపై చెత్త కుప్పలు, పారిశుద్ధ్యం గాలికే..

ప్రజలు నివసించే ప్రాంతాల్లో పరిశుభ్రతను కాపాడాల్సిన మున్సిపల్ యంత్రాంగం బాధ్యతను విస్మరిస్తోందా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. రోడ్ల పక్కన పేరుకుపోతున్న చెత్త, అక్కడక్కడా కనిపిస్తున్న మట్టి దిబ్బలు ప్రజలకు అసౌకర్యాన్ని కలిగిస్తున్నాయి. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాల్సిన సిబ్బంది విధుల నిర్వహణపై పర్యవేక్షణ ఎంతవరకు ఉందన్నది ప్రశ్నార్థకంగా మారింది. పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరుగుతున్నాయా.? క్షేత్రస్థాయిలో అధికారులు తనిఖీలు చేస్తున్నారా.? లేక కార్యాలయాలకే పరిమితమవుతున్నారా.? అన్న దానిపై డిప్యూటీ కమిషనర్లు కానీ జోనల్ కమిషనర్ కానీ ఏ రోజు పట్టించుకున్న పాపాన పోలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## గుంతలమయంగా రహదారులు.. ఇంజనీరింగ్ విభాగం ఏం చేస్తోంది.?

సికింద్రాబాద్ నియోజకవర్గంలోని పలు రహదారులపై గుంతలు వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. రహదారుల మరమ్మతులు చేపట్టి ప్రజలకు సురక్షిత ప్రయాణాన్ని అందించాల్సిన ఇంజనీరింగ్ విభాగ అధికారులు పూర్తి బాధ్యతరాహిత్యంగా వ్యవహరిస్తున్నారు. వీళ్ళ పనితీరుపై గతం నుండి ప్రస్తుతానికి అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయినా ఇప్పటివరకు డిప్యూటీ, జోనల్ కమిషనర్లు పట్టించుకున్న దాఖలాలు లేవు మరి ఎందుకో.? గుంతలు ఏర్పడిన వెంటనే తాత్కాలిక మరమ్మతులు కూడా చేయలేని బాధ్యతారాహిత్యం, శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ద్విచక్ర వాహనదారులు, వృద్ధులు, పాఠశాలలకు వెళ్లే చిన్నారులు ప్రయాణించే రహదారులపై నిర్లక్ష్యం ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉంది. ఎన్ని గుంతలు ఉన్నా పట్టించుకునే దిక్కు లేదనే ప్రజల ఆవేదనను ఉన్నత అధికారులు ఇప్పటికైనా గుర్తించాలి.

## లాలాపేట పెద్ద నాలా వద్ద దుర్గంధం.. ప్రజారోగ్యానికి ముప్పు

లాలాపేట పెద్ద నాలా వద్ద మురుగునీరు నిలిచిపోయి అతి దారుణంగా దుర్వాసన వెదజల్లుతున్న పరిస్థితిపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. డ్రెయినేజీ వ్యవస్థలో అడ్డంకులు ఏర్పడితే వాటిని తొలగించి నీరు సాఫీగా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలి. మురుగునీటి నిల్వలు దోమల పెరుగుదలకు, పరిసరాల అపరిశుభ్రతకు కారణమయ్యే ప్రమాదం ఉంది. సమస్యను గుర్తించిన వెంటనే శానిటేషన్, ఇంజనీరింగ్ విభాగాలు స్పందించాలి. ప్రజలు దుర్గంధాన్ని భరిస్తూ జీవించాల్సిన పరిస్థితి ఎందుకు ఏర్పడుతోందన్న ప్రశ్నకు అధికారులు సమాధానం చెప్పాలి.

## పర్యవేక్షణ శూన్యం, బాధ్యత ఎవరిది.?

పారిశుద్ధ్యం, రహదారుల నిర్వహణ, డ్రెయినేజీ సమస్యలు ఒక్క రోజులో పరిష్కారం కావు. అయితే వాటిని గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించడం అధికారుల బాధ్యత. క్షేత్రస్థాయి సిబ్బంది పనితీరును పర్యవేక్షించాల్సిన ఉన్నతాధికారులు నిరంతర తనిఖీలు చేపట్టాలి. సమస్యలపై ఫిర్యాదులు వచ్చినప్పుడు స్పందించి, పరిష్కారానికి గడువు నిర్ణయించి, పనుల పురోగతిని ప్రజలకు తెలియజేయాలి. ప్రజాధనం ఖర్చవుతున్నప్పుడు పనుల నాణ్యత, నిర్వహణపై జవాబుదారీతనం కూడా ఉండాలి కానీ సికింద్రాబాద్ జోన్ పరిధిలో ఉన్న సర్కిలలో ఈ పరిస్థితి ఎప్పుడు కనిపించలేదు, కనిపించదు కూడా అన్న విమర్శలు ఉన్నాయి.

## తెల్లచొక్కాల నాయకులారా.. ప్రజా సమస్యలు కనిపించడం లేదా.?

ప్రజల ఓట్లతో పదవులు పొందిన నాయకులు ప్రజల మధ్యకు వచ్చి వారి సమస్యలను తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం, ఆ తర్వాత ప్రజల ఇబ్బందులను అసలు పట్టించుకోకపోవడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. అధికార పక్ష నాయకులే కాకుండా ప్రతిపక్ష నేతలు కూడా ప్రజా సమస్యలపై గళమెత్తాలి. రోడ్ల దుస్థితి, చెత్త సమస్య, డ్రెయినేజీ దుర్వాసన వంటి అంశాలపై అధికారులను నిలదీసి పరిష్కారం సాధించాలి. ప్రజల సమస్యలను ప్రశ్నించని ప్రతిపక్ష నాయకులు ఉన్నా లేనట్టే అన్న విమర్శలకు తావివ్వకూడదు.

తెల్లచొక్కాలు ధరించి నాయకులుగా చలామణి కావడం కాదు. ప్రజల కష్టాల్లో పాలుపంచుకున్నప్పుడే నిజమైన నాయకత్వానికి అర్థం ఉంటుంది.



సికింద్రాబాద్ నియోజకవర్గంలో ఒక్కో సమస్యను గుర్తించి పరిష్కరించేందుకు చొరవ చూపని నాయకులు ప్రజలకు ఏం సమాధానం చెబుతారు.?

## ఇప్పటికైనా సమస్యను తీరుస్తారా.?

సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలో నెలకొన్న అనేక సమస్యలపై మున్సిపల్ అధికారులు, ఇంజనీరింగ్, శానిటేషన్ విభాగం, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి చెత్త కుప్పలను తొలగించాలి, గుంతల రహదారులకు మరమ్మతులు చేపట్టాలి, లాలాపేట పెద్ద నాలా వద్ద మురుగునీటి సమస్యను పరిష్కరించాలి. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి చర్యల ప్రణాళిక రూపొందించాలి. ప్రజలకు కావాల్సింది రోడ్లపై, చౌరస్తాలలో ఏర్పాటు చేసే ఫ్లెక్సీలు కాదు, క్షేత్రస్థాయిలో కనిపించే పరిష్కారాలు. సికింద్రాబాద్‌ను పరిశుభ్రంగా, సురక్షితంగా మార్చే బాధ్యత నుంచి అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పించుకోలేరు. ప్రజల సహనాన్ని పరీక్షించకుండా ఇప్పటికైనా సమస్యల పరిష్కారానికి దిగుతారా.? లేదా.? అన్నది వేచి చూడాలి.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588